నవతెలంగాణ
1
ఆదిలాబాద్
శుక్రవారం | సెప్టెంబర్ 15, 2023 | www.navatelangana.com

శిఖర్ కైలాష్‌టెక్డి ఆలయాన్ని దర్శించుకున్న ఎంఎల్‌సీ

నవతెలంగాణ-బోథ్

మండలంలోని నిగ్ని ప్రముఖ పుణ్యక్షేత్రం శిఖర్ కైలాష్‌టెక్డి శివాలయాన్ని ఉమ్మడి అదిలాబాద్ జిల్లా ఎంఎల్‌సి దండే విఠల్, బోథ్, ఖానాపూర్ నియోజకవర్గాల బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థులు అనిల్ జాదవ్, భూక్యా జాన్సన్ నాయక్ దర్శించుకున్నారు. ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. లింబాజీ మహారాజ్ ఆశీర్వాదాలు తీసుకున్నారు. శివాలయం అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ తుల శ్రీనివాస్, జెడ్పీటీసీ డా.సంధ్యారాణి ప్రసాద్, ఇచ్చోడ ఎంపీపీ నిమ్మల ప్రీతంరెడ్డి, సర్పంచుల సంఘం అధ్యక్షులు తిరుమలగౌడ్, శ్రీధర్‌రెడ్డి, ముండే పాండురంగ్, బోథ్ సర్పంచ్ సురేందర్ యాదవ్ పాల్గొన్నారు.



పేద కుటుంబానికి రూ.లక్ష ఆర్థికసాయం

నవతెలంగాణ-ఇచ్చోడ

మండలంలోని మల్యాల గ్రామానికి చెందిన ఆత్రం పారుబాయికి నటుడు విజయ్ దేవరకొండ గురువారం హైదరాబాద్‌లోని ఆయన నివాసంలో రూ.లక్ష ఆర్థికసాయం చెక్కు గ్రామ సర్పంచ్ సమక్షంలో అందజేశారు. ఈ సందర్భంగా నటుడు విజయ్ దేవరకొండ ఫ్యాన్స్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు నక్క గణేష్ మాట్లాడుతూ వంద పేద కుటుంబాలకు అండగా రూ.కోటి పంపిణీ చేశారన్నారు. అందులో భాగంగానే మాల్యాల గ్రామానికి చెందిన పారుబాయికి ఆర్థిక సాయం అందించారని తెలిపారు. హీరో విజయ్ దేవరకొండకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ లావణ్య, రాజు ఉన్నారు.



పోడు పట్టాలకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలి

- ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్



నవతెలంగాణ-ఉట్నూర్

ప్రభుత్వం ఇటీవల పోడు భూములకు పట్టాలు అందించిన రైతులకు బ్యాంకు రుణాలు మంజూరు చేయాలని ఐటీడీఏ పీఓ చాహత్ బాజ్‌పాయ్ బ్యాంకు అధికారులను ఆదేశించారు. గురువారం పీఓ క్యాంపు కార్యాలయంలో ఆర్థిక సాయం, పంట రుణాల మంజూరుపై గిరిజన సంక్షేమ, ఉమ్మడి జిల్లా బ్యాంకుల అధికారులతో ఆమె సమీక్షించారు. పోడు పట్టా రైతులకు పంట రుణాలను సకాలంలో మంజూరు చేయాలన్నారు. అర్హులైన గిరిజన లబ్ధిదారులకు స్వయం ఉపాధి పథకాలకు యూనిట్లు మంజూరు చేయడం జరిగిందని, నిర్దేశించిన లక్ష్యం మేరకు బ్యాంకులు రుణాలు మంజూరు చేయాలని ఆదేశించారు. అనంతరం జిల్లాల, బ్యాంకుల వారీగా లక్ష్యాలను చర్చించారు. ఈ సమావేశంలో లీడ్ బ్యాంకు మేనేజర్ ప్రసాద్, ఐటీడీఏ ఏవో రాంబాబు, డిపిఓ ప్రవీణ్, వివిధ బ్యాంకు, ఐటీడీఏ అధికారులు పాల్గొన్నారు.

స్వచ్ఛసర్వేక్షణ్-2023 రాష్ట్ర అవార్డుకు నచ్చన్‌ఎల్లాపూర్ ఎంపిక



నవతెలంగాణ-కడెం

మండలంలోని నచ్చన్‌ఎల్లాపూర్ గ్రామం స్వచ్ఛసర్వేక్షన్ గ్రామీణ్-2023 అవార్డుకు ఎంపికైంది. గురువారం హైదరాబాద్ టిఎస్ఐఆర్‌డిలో పంచాయతీరాజ్ మంత్రి ఎర్రబెల్లి దయాకర్‌రావు, ప్రిన్సిపాల్ సెక్రెటరీ సందీప్‌కుమార్ సుల్తానియా ద్వారా సర్పంచ్ బొడ్డు గంగన్న, కార్యదర్శి రమాదేవి అవార్డు అందుకున్నారు. కార్యక్రమంలో డిఆర్‌డిఓ విజయలక్ష్మి, జెడ్పి సీఈవో సుధీర్‌కుమార్, ఎస్‌బిఎం కన్సల్టెంట్ అబుజర్, ఏపీవో జయదేవ్ పాల్గొన్నారు.

సమాజాన్ని తప్పుబట్టడం సరికాదు

నవతెలంగాణ-ఇంద్రవెల్లి

గత నెల 28న మండల కేంద్రంలో నిర్వహించిన సాహిత్య సామ్రాట్ అన్నాబావు సాఠే జయంతి ఉత్సవాలకు తమ కుటుంబానికి పిలవలేదనే కోపంతో అన్నాబావు సాఠే చిత్రపటంతో పాటు జెండాను ధ్వంసం చేశానని మోతెవార్ అక్షయ్ పోలీసులకు వాంగ్మూలం ఇవ్వడం సరికాదని ఆ సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మోరె నర్సింగ్ అన్నారు. గురువారం మండల కేంద్రంలో ప్రెస్‌భవన్‌లో విలేకరులతో మాట్లాడారు. జయంతి ఉత్సవాల్లో అక్షయ్ తండ్రి స్టేజితోపాటు అన్ని కార్యక్రమాలలో చురుకుగా పాల్గొన్నారని తెలిపారు. తమ దగ్గర ఆయన తండ్రికి సంబంధించిన అన్ని రకాల ఆధారాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉద్దేశపూర్వకంగా యావత్ మాంగ్ సమాజాన్ని తప్పు పట్టడం సరికాదన్నారు. అక్షయ్ చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో అన్నాబావు సాఠే అసోసియేషన్ మండల అధ్యక్షుడు కాంబ్లే బాలరాజ్, రాష్ట్ర నాయకులు కాంబ్లే బాలాజీ, సభ్యులు ఎ.బాలాజీ, మాధవ్, ఎం.గంగాధర్ పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల బదిలీ, ఉద్యోగోన్నతులు వెంటనే చేపట్టాలి

నవతెలంగాణ-ఉట్నూర్

గిరిజన ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతులు వెంటనే చేపట్టాలని డీటీఎఫ్ రాష్ట్ర కార్యదర్శి శ్యాముల్, జిల్లా కార్యదర్శి వీరయ్య, జిల్లా నాయకులు ప్రకాష్ అన్నారు. గురువారం ప్రెస్‌భవన్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఉపాధ్యాయుల బదిలీలకు సంబంధించి ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించి ఇప్పటి వరకు ఎలాంటి సమాచారం లేదన్నారు. గిరిజన ఉపాధ్యాయులను ఏజెన్సీ నుంచి ఏజెన్సీకి కేటాయించాలన్నారు. గిరిజన విద్య పర్యవేక్షణ కొరకు అన్ని పోస్టులను భర్తీ చేసి రద్దు చేసిన ఏజెన్సీ డీఈఓ పోస్టును తిరిగి పున:ప్రారంభించాలన్నారు. ఉపాధ్యాయులు బదిలీలు పారదర్శకంగా నిర్వహించాలన్నారు. గిరిజన ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలని కోరారు.

విశ్వకర్మ జయంతిని అధికారికంగా నిర్వహించాలి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

17న ఆదివారం విశ్వకర్మ జయంతిని ప్రభుత్వం అధికారికంగా నిర్వహించాలని విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) సంఘం జిల్లా నాయకులు కోరారు. గురువారం ఇన్‌చార్జి జిల్లా బిసి సంక్షేమ అధికారిణి రమాదేవికి వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గత సంవత్సరం ప్రభుత్వం అధికారికంగా విశ్వకర్మ జయంతిని నిర్వహించిందన్నారు. అదే మాదిరిగా ప్రస్తుతం కూడా నిర్వహించాలని, కలెక్టరేట్‌లో వేడుకలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో విశ్వబ్రాహ్మణ(విశ్వకర్మ) జిల్లా గౌరవ అధ్యక్షుడు సురేష్ చారి, జిల్లా అధ్యక్ష కార్యదర్శులు భాస్కరాచారి, అశోక్‌చారి, మండల అధ్యక్షుడు రాధాకృష్ణచారి పాల్గొన్నారు.

పోషకాహారంపై అవగాహన

నవతెలంగాణ-ఖానాపూర్

పట్టణంలోని శాంతినగర్ తిమ్మాపూర్-2 అంగన్‌వాడీ కేంద్రంలో గురువారం పోషకాహార వారోత్సవాల్లో భాగంగా పోషకాహారంపై సూపర్‌వైజర్ నిర్మల గర్భిణులు, చిన్న పిల్లల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా పోషకాహారం వల్ల కలిగే ప్రయోజనాలు గురించి వివరించారు. పోషకాహారాలు తీసుకునే విధానాన్ని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎం పద్మలత, అంగన్‌వాడీ కార్యకర్త రామ్ వెంకటమ్మ, ఆయ నర్సమ్మ, ఆశా కార్యకర్త గంగమణి, పాల్గొన్నారు.

ప్రీమెట్రిక్ ఉపకారవేతనాలకు దరఖాస్తులు స్వీకరణ

ఆదిలాబాద్ : జిల్లాలో ప్రభుత్వ ప్రభుత్వ గుర్తింపు పొందిన, ఎయిడెడ్ పాఠశాలలో 1 నుండి 10వ తరగతి వరకు చదువుకుంటున్న వికలాంగ విద్యార్థులకు 2023-24 ఆర్థిక సంవత్సరానికి ప్రీమెట్రిక్ ఉపకారవేతనాలు మంజూరు చేయడానికి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని డీబ్ల్యుఓ. డా.కె.మిల్కా ఒక ప్రకటనలో పేర్కొన్నారు. దరఖాస్తు ఫారాన్ని ఆన్‌లైన్‌లో నింపి ఈ నెల 30లోపు సంబంధిత ప్రిన్సిపాల్, ప్రధానోపాధ్యాయుల ద్వారా డీబ్ల్యుఓ కార్యాలయంలో అందజేయాలని తెలిపారు.

నిర్మాణ కౌశలం..!

- సాత్నాల వాగుపై నుంచి పెన్‌గంగ కెనాల్
- అత్యాధునిక పద్ధతిలో వయాడక్ట్ నిర్మాణం
- తెలుగు రాష్ట్రాల్లో ఇక్కడే తొలిసారి విజయం
- ఇంజనీర్ల నైపుణ్యానికి సర్వత్రా ప్రశంసలు

ఇదో మారుమూల ప్రాంతం.. కమ్యూనికేషన్.. ట్రాన్స్‌ఫోర్ట్ వ్యవస్థ కూడా సక్రమంగా లేని ఆదిలాబాద్ జిల్లాలో అత్యాధునిక పద్ధతిలో చేపట్టిన కెనాల్ నిర్మాణం జిల్లాకే తలమానికంగా నిలిచింది. తెలుగు రాష్ట్రాల్లోనే కొత్తదనాన్ని తీసుకొచ్చింది. ఆదిలాబాద్ గ్రామీణ మండలం చాందా(టి) సమీపంలో సాత్నాల వాగుపై నిర్మించిన పెన్‌గంగా కెనాల్ ఇంజనీరింగ్ అధికారుల ప్రతిభను అబ్బురపరిచేలా చేసింది. తెలుగు రాష్ట్రాల్లో ఎక్కడా లేని విధంగా అత్యాధునిక పద్ధతిని ఉపయోగించి నిర్మించిన ఈ వయాడక్ట్ నిర్మాణం చేపట్టడం తొలిసారి. ఖర్చుతో కూడుకున్న పద్ధతిని పక్కనపెట్టి వినూత్న రీతిలో ఆలోచన చేసి కెనాల్‌ను ఏకంగా నది దాటించి రైతులకు సాగు నీరందించేందుకు కృషి చేశారు. గతంలో ఎలాంటి టెక్నాలజీ అందుబాటులోని సమయంలోనూ అనేక కట్టడాలు.. వారధులు నిర్మించిన ఇంజనీర్లు.. తాజాగా వచ్చిన కొత్త టెక్నాలజీని వినియోగించుకొని నిర్మాణాలకు మరింత వన్నె తీసుకొస్తున్నారు. శుక్రవారం మోక్షగుండం విశ్వేశ్వరయ్య జయంతిని పురస్కరించుకొని ఇంజనీరింగ్ డేను నిర్వహిస్తున్నారు. ఈ సందర్భంగా ఇంజనీర్ల ప్రాధాన్యతపై కథనం..

నవతెలంగాణ- ఆదిలాబాద్ ప్రాంతీయ ప్రతినిధి

ఆదిలాబాద్ జిల్లా చాందా(టి) సమీపంలోని సాత్నాల నదిపై నిర్మించిన పెన్‌గంగ బ్యారేజీ కెనల్(వయాడక్ట్) అందరినీ ఆశ్చర్యపరుస్తోంది. కెనాల్‌ను సులువుగా వాగును దాటించడంతో ఇది సాధ్యమైందనే విషయమై అప్పట్లో చర్చనీయాంశమైంది. తెలుగు రాష్ట్రాల్లో ఈ పద్ధతి కొత్తగా కావడంతో జిల్లాకు చెందిన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులతో పాటు రాష్ట్ర స్థాయి అధికారులు కూడా వచ్చి ఈ వయాడక్ట్‌ను సందర్శించారు. ఇంజనీరింగ్ అధికారుల ప్రతిభ..శ్రమను మెచ్చుకున్నారు. 1.5కిలోమీటరు దూరం కలిగిన సాత్నాల వాగుపై కెనాల్ నిర్మించాలంటే ఖర్చుతో కూడుకున్న పని. వాగు కింద 10మీటర్ల బ్యాకింగ్‌లో 40మీటర్ల లోతులో మట్టిపోసి కెనాల్ నిర్మించాలంటే అధిక వ్యయమవుతుంది. మరోపక్క 40మీటర్ల ఎత్తులో సెంట్రింగ్ కొట్టి స్లాబ్ వేయాలంటే కూడా కష్టంతో కూడుకున్నది. దీంతో ఎలాగైనా ఈ వాగుపై కెనాల్ నిర్మాణం చేపట్టాలని భావించిన అధికారులు వారి ప్రతిభను పదును పెట్టారు. ప్రీకాస్ట్‌పోస్ట్ టెన్షనింగ్ వయాడక్ట్‌ను నిర్మించాలని భావించారు. ఇతర రాష్ట్రాల్లో చిన్నచిన్న కట్టడాలను పరిశీలించిన అధికారులు వాటికంటే పెద్ద సైజులో వయాడక్ట్ నిర్మించారు. ఈ వయాడక్ట్ 5.25మీటర్ల వెడల్పులో 3.15 ఎత్తులో నిర్మించారు. దీనికి ఉపయోగించిన సెల్స్ ఒక్కోటి 25మీటర్ల వరకు ఉంటుంది. ఇలాంటివి 69సెల్స్‌ను వినియోగించి కెనాల్ నిర్మాణం పూర్తిచేయడం విశేషం.

రైతుల ప్రయోజనం కోసం..!

జిల్లాకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు సుమారు ఏడాది పాటు శ్రమించి నిర్మించిన ఈ కెనాల్ రైతులకు ఎంతో ప్రయోజనం చేకూర్చనుంది. ప్రస్తుతం బ్యారేజీ నిర్మాణం పూర్తికావడంతో కెనాల్ కూడా పూర్తి పూర్తయింది. కానీ డిస్ట్రిబ్యూటరీ కాల్వల నిర్మాణం చేపడితే ఈ కెనాల్ ద్వారా బేల, జైనథ్ మండలాల్లోని 68 గ్రామాల పరిధిలో 35,700 ఎకరాలకు సాగునీరందించేందుకు వీలుంటుంది. రైతులకు ఎలాగైనా సాగునీరందించి పంటలను సశ్యశ్యామలం చేయాలనే ఉద్దేశంతో అధికారులు చేసిన ఈ కృషికి సర్వత్రా ప్రశంసలు దక్కుతున్నాయి. ఇతర ప్రాంతాలకు చెందిన ఇంజనీరింగ్ అధికారులు, ప్రజాప్రతినిధులు ఇక్కడకు వచ్చి ఈ నిర్మాణ శైలిని పరిశీలించి అధికారులను అభినందించారు. ఇలా భావి తరాలకు ఉపయోగపడే నిర్మాణాలు చేపడుతూ ఇంజనీరింగ్ అధికారులు ప్రజల గుండెల్లో నిలిచిపోతున్నారు.



సాత్నాల వాగుపై నిర్మించిన వయాడక్ట్

చాలా సంతృప్తి కలిగించింది : రవీందర్, పెన్‌గంగ ఈఈ, ఆదిలాబాద్



మారుమూల ప్రాంతంలో కమ్యూనికేషన్, ట్రాన్స్‌ఫోర్ట్ వ్యవస్థ సక్రమంగా లేని ఈ ప్రాంతంలో ఈ తరహా వయాడక్ట్ నిర్మించడం చాలా సంతోషంగా అనిపించింది. అత్యాధునిక పద్ధతిలో నిర్మించిన ఈ కెనాల్‌తో రైతులకు చాలా ప్రయోజనం కలుగుతుంది. ఇక్కడి వేలాది ఎకరాలకు సాగునీరందించేందుకు ఆస్కారం ఉంటుంది.

ఘనంగా పొలాల అమావాస్య



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా కేంద్రంలో గురువారం ఘనంగా పొలాల అమావాస్య వేడుకలు నిర్వహించారు. రైతులకు ముఖ్యమైన పండుగ కావడంతో ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధుల గుండా తిప్పారు. గాంధీ చౌక్‌లో గల ఆలయం నుండి ర్యాలీగా వెళ్లారు. పొలాల అమావాస్య సందర్భంగా కుమురం భీం చౌక్ నుండి గాంధీ చౌక్ వరకు వివిధ ప్రాంతాల నుండి వచ్చిన రైతులు తమ ఎడ్లతో భారీ ర్యాలీ నిర్వహించారు. ఎమ్మెల్యే ఆత్రం సక్కు, జిల్లా పరిషత్ చైర్పర్సన్ కోవలక్ష్మి రైతులతో కలిసి నృత్యం చేశారు. జిల్లా కేంద్రంలోని ప్రధాన వీధులన్నీ అలంకరించిన ఎడ్లతో నిండుగా కనిపించాయి. ఈ కార్యక్రమంలో జెడ్పిటిసి అరిగెల నాగేశ్వరరావు, కాంగ్రెస్ నాయకులు శ్యాంనాయక్, గణేష్ రాథోడ్, మర్సుకోల సరస్వతి, బిజెపి రాష్ట్ర నాయకుడు సతీష్‌బాబు, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు విశాల్, బీఆర్ఎస్ నాయకులు బాలేష్‌గౌడ్, మంగ పాల్గొన్నారు.

ఇంద్రవెల్లి: పొలాల పండుగను మండల ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఎడ్లను వాగులో నీటితో శుభ్రం చేసి రంగులతో అలంకరించారు. ఎడ్ల జతలతో హనుమాన్ ఆలయం వద్దకు చేరుకుని మందిరం చుట్టూ ప్రదక్షణలు చేయించారు. అనంతరం ఎడ్లకు ఇంటివద్ద పూజలు చేశారు.

కుభీర్ : మండల కేంద్రంతో పాటు అన్ని గ్రామాల్లో గురువారం పొలాల అమావాస్య ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో రైతులు ఎద్దులను రంగులతో అలంకరించి ఆలయాల చుట్టూ డప్పు చప్పుళ్ల మధ్య తిప్పారు. అనంతరం ఇంటికి వచ్చిన బసవన్నలకు హారతులు ఇచ్చి నైవేద్యాలు సమర్పించారు.

దిలావర్‌పూర్ : మండలంలోని అన్ని గ్రామాలలో పొలాల అమావాస్య పండుగను గురువారం రైతులు ఘనంగా జరుపుకున్నారు. ఎడ్లను శుభ్రంగా కడిగి అలంకరించి, ఆలయాల చుట్టూ తిప్పారు. రైతులు తమ ఇండ్లలో పిండి వంటలను చేసి ఆవులకు, ఎడ్లకు నైవేద్యం పెట్టారు. గ్రామస్తులంతా అలంకరించిన ఎడ్ల చుట్టూ తిరుగుతూ వీక్షించారు.

నార్నూర్ : మండల కేంద్రంతో పాటు మండలంలోని గిరిజన ఆదివాసీ గ్రామాల్లో గురువారం పొలాల అమావాస్య పండగను ఘనంగా జరుపుకున్నారు. పొలాల పండుగ సందర్భంగా రైతులు తమ ఎద్దులను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేశారు. వీరాంజనేయ స్వామి ఆలయం చుట్టూ ఎడ్లను ప్రదిక్షణలు చేయించారు. అనంతరం ఆయా గ్రామాల్లో ఎడ్లను ఊరేగించి పిండివంటల నైవేద్యాలను సమర్పించారు.

తలమడుగు: మండలంలోని అన్ని గ్రామాల్లో పొలాల అమావాస్యను ఘనంగా నిర్వహించుకున్నారు. రైతులు తమ ఎడ్లను సమీపన గల వాగులు, చెరువు గట్టులోకి తీసుకెళ్లి శుభ్రం చేశారు. అందంగా అలంకరించారు. కాళ్లకు గజ్జలు కట్టి డప్పు చప్పుల మధ్య గ్రామంలో గల హనుమాన్ మందిర్, పోచమ్మ గుడి చుట్టు తిప్పారు. మండల కేంద్రంలో నిర్వహించిన పొలాల పండుగలో గ్రామ సర్పంచ్ కళ్లెం కరుణాకర్ రెడ్డితోపాటు గ్రామస్తులు, రైతులు, యువకులు పాల్గొన్నారు.

తాంసి: అన్నదాతలు బసవన్నలను పూజించే పర్వదినం పొలాల అమావాస్య పండుగ గురువారం తాంసి, భీంపూర్ మండలాల్లో ఘనంగా జరుపుకున్నారు. ఎడ్లను ఒక రోజు ముందు సాయంత్రం పసుపు నూనెను మెడకు రాసి బరుల్ దించడం చేశారు. వాగులో ఎడ్లను శుభ్రంగా కడిగి అందంగా తయారు చేసి సాయంత్రం పొచ్చమ్మ, హనుమాన్ మందిరాల దగ్గరికి తీసుకెళ్లారు. గ్రామ పటేల్, గ్రామ సర్పంచ్‌లతో ప్రత్యేక పూజలు నిర్వహించి మామిడి తోరణం తెంపి ఆలయాల చుట్టూ తిప్పారు.

సిరికొండ: మండల కేంద్రంతో పాటు మండలంలోని పలు గ్రామాలలో గురువారం పొలాల అమావాస్య పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుంచే భక్తులు ఆలయాలలో ప్రత్యేక పూజలు చేశారు. రైతులు ఎడ్లను ప్రత్యేకంగా అలంకరించి మందిరాల చుట్టూ ప్రదక్షణలు చేయించి, నైవేద్యాలు సమర్పించారు.



దిలావర్‌పూర్ :



తలమడుగు:

ఉప్పొంగిన ఒర్రె..నిలిచిన రాకపోకలు

నవతెలంగాణ-దహెగాం

మండలంలో బుధవారం రాత్రి భారీగా కురిసిన వర్షాలకు వాగులు, వంకలు పొంగిపొర్లుతున్నాయి. లోలెవల్ వంతెనల వద్ద రవాణా స్తంభించింది. కొత్మీర్ జెండాగూడ గ్రామాల మధ్య ఒర్రె గురువారం ఉదయం ఉప్పొంగి ప్రవహించడంతో జెండగూడ, దుబ్బగూడ గ్రామాల ప్రజలు ఎటూ వెళ్లలేని పరిస్థితి ఏర్పడింది. మురళీగూడ గ్రామ సమీపంలో ఒర్రె కూడా ఉప్పొంగడంతో ప్రజలు వేరే గ్రామానికి రాలేని పరిస్థితి నెలకొంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి వంతెనలు నిర్మించాలని ప్రజలు కోరుతున్నారు.



25నుండి సమ్మెలోకి ఆశాలు

- కలెక్టరేట్ ఎదుట నిరసన
- కలెక్టర్‌కు, డీఎంహెచ్‌ఓకు సమ్మె నోటీసు



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఆశా వర్కర్లకు పారితోషికాలను రూ.18వేలకు పెంచి ఫిక్సిడ్ వేతనం నిర్ణయించాలని, ఇతర సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ 25 నుండి సమ్మెలోకి వెళ్తామని సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్ తెలిపారు. గురువారం తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్(సిఐటియు) ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట నిరసన తెలిపారు. ఈ సందర్భంగా కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలో ఆశాల్లో బడుగు, బలహీనవర్గాలకు చెందిన వారున్నారని తెలిపారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశా వర్కర్లు కీలకపాత్ర పోషించారని తెలిపారు. డబ్ల్యుహెచ్ ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును కూడా ప్రకటించిందని గుర్తు చేశారు. ఇన్ని పనులు నిర్వహిస్తూ పేద ప్రజలకు సేవలందిస్తున్న ఆశాలకు నేటికీ ఫిక్స్ వేతనం నిర్ణయం చేయకపోవడం బాధాకరమన్నారు. ఆశాలకు పిఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం, ఉద్యోగ భద్రత కల్పించాలని, హెల్త్ కార్డులు ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం రూ.5 లక్షలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్ రూ.5లక్షలు ఇచ్చి సంక్షేమ పథకాలన్నింటినీ వర్తింపజేయాలని పేర్కొన్నారు. పని భారం తగ్గించి, జాబ్‌చార్టు విడుదల చేయాలని, 2021 జూలై నుండి డిసెంబర్ వరకు 6నెలల పీఆర్సీ ఏరియర్స్ వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలని, లేనిపక్షంలో 25నుండి సమ్మెలోకి పోతామని హెచ్చరించారు. అనంతరం జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్‌కు, వైద్యారోగ్యశాఖాధికారి డా.నరేందర్ రాథోడ్‌ను కలిసి సమ్మె నోటీసు అందజేశారు.

టెట్ పకడ్బందీగా నిర్వహించాలి

- రాష్ట్ర పరిశీలకులు డాక్టర్ రవికాంత్‌రావు



నవతెలంగాణ-ఆసిఫాబాద్

నిబంధనలు పాటిస్తూ ఉపాధ్యాయ అర్హత పరీక్ష (టెట్) పకడ్బందీగా నిర్వహించాలని రాష్ట్ర పరిశీలకులు రాష్ట్ర విద్యా శిక్షణ పరిశోధన సంస్థ ప్రొఫెసర్ డాక్టర్ రవికాంత్ రావు అన్నారు. టెట్ నిర్వహించే కాగజ్‌నగర్, ఆసిఫాబాద్ పరీక్షా కేంద్రాలను పరిశీలించి, అక్కడ ఏర్పాటు చేసిన వసతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడుతూ అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందులు కాకుండా చూడాలన్నారు. పరీక్షకు హాజరయ్యే అభ్యర్థులు తప్పనిసరిగా సమయాని కంటే ముందే పరీక్ష కేంద్రానికి రావాలని తెలిపారు. ఎట్టి పరిస్థితుల్లోనూ స్మార్ట్ వాచ్‌లు, మొబైల్ ఫోన్లు పరీక్ష కేంద్రానికి తీసుకురావద్దని తెలిపారు. పరీక్ష పూర్తయ్యే వరకు అభ్యర్థులను బయటకు వదలకూడదని సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పార్మి అశోక్, అకాడమిక్ మానిటరింగ్ అధికారి ఉప్పులేటి శ్రీనివాస్ పాల్గొన్నారు.

నిర్మల్ : టెట్ ఏర్పాట్లపై కలెక్టర్ వరుణ్‌రెడ్డి, అదనపు కలెక్టర్ కిషోర్‌కుమార్‌తో కలిసి గురువారం దివ్య గార్డెన్‌లో సంబంధిత అధికారులు, పరీక్ష నిర్వహణ సిబ్బందితో సమీక్షించారు. అధికారులకు, ఇన్విజిలేటర్‌లకు పలు సూచనలు చేశారు. టెట్‌కు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, సీసీ కెమెరాల నిఘాలో పరీక్ష ఉంటుందని తెలిపారు. జిల్లాలోని మొత్తం 53కేంద్రాల్లో 12,197 మంది పరీక్షకు హాజరవుతారని తెలిపారు. పరీక్షకు 32 మంది ముఖ్య పర్యవేక్షకులు, 32 మంది శాఖాధికారులు, 6గురు రూట్ అధికారులు, రాష్ట్ర పరిశీలకులు, 352 మంది ఇన్విజిలేటర్‌లు విధులు నిర్వహిస్తారని పేర్కొన్నారు. సమావేశంలో డిఈఓ, పరీక్షల సమన్వయకర్త డా. ఎ.రవీందర్‌రెడ్డి, పరీక్షల సహాయ కమిషనర్ సిద్ధ పద్మ, ముఖ్య పర్యవేక్షకులు, శాఖాధికారులు, ఇన్విజిలేటర్లు పాల్గొన్నారు.

ముదిరాజ్‌లు ఐక్యంగా ఉండాలి

- ముదిరాజ్ ఆత్మగౌరవ సభను విజయవంతం చేయాలి



నవతెలంగాణ- ఖానాపూర్

ముదిరాజ్‌లు అందరూ ఐక్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని జిల్లా కోర్ కమిటీ సభ్యులు సాయన్న, పాతర్ల గణేష్, దేవేందర్, పాతర్ల హరీష్, ఉమా మహేశ్వర్ అన్నారు. గురువారం పట్టణంలోని పీఆర్‌టీయూ భవనంలో ఖానాపూర్ నియోజకవర్గ ముదిరాజ్ సభ్యులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అక్టోబర్ 2న జిల్లా కేంద్రంలోని ఎన్టీఆర్ స్టేడియంలో జరిగే ముదిరాజ్ ఆత్మ గౌరవ సభకు ముదిరాజ్ సంఘ నాయకులు, కులస్తులు తరలి రావాలన్నారు. ముదిరాజ్‌లు అందరూ ఐకమత్యంగా ఉండి హక్కులు సాధించుకోవాలని తెలిపారు. ముదిరాజ్‌లను బిసి-డి నుండి బీసీ-ఏకు మార్చాలని, విద్యా, ఉద్యోగాల్లో ప్రత్యేక రిజర్వేషన్‌లు కల్పించాలని పేర్కొన్నారు. జిల్లాలోని అన్ని మత్స్య సొసైటీలో ఎలాంటి షరతులు లేకుండా సభ్యత్వం కల్పించాలన్నారు. బీసీ బంధులో ముదిరాజ్‌లకు చోటు కల్పించాలని తెలిపారు. అనంతరం ఆత్మగౌరవ సభ పోస్టర్‌లను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమం జిల్లా కోర్ కమిటీ సభ్యులు ధర్మన్న, చంద్రశేఖర్, రాజేష్, నర్సయ్య, మోహన్, ఖానాపూర్ నియోజకవర్గ నాయకులు జక్కుల నాగరాజు, వెంకటేష్, మురళి, బొంత భీమాలింగు, నరేష్, రాజేందర్, గంగనర్సయ్య, చీకట్ల రాజేందర్, మనోజ్, పంభాల రాజేందర్ పాల్గొన్నారు.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
ఆదిలాబాద్-నిర్మల్
శుక్రవారం | సెప్టెంబర్ 15, 2023 | www.navatelangana.com

ఎండీ రఫిక్ అహ్మద్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ఎంపీఓ

నవతెలంగాణ-కడెం

మండలంలోని ఎంపీపీ కార్యాలయంలో నూతన ఎంపీఓగా బాధ్యతలు స్వీకరించిన ఉపేందర్ గురువారం నిర్మల్ జిల్లా జెడ్పి కోఆప్షన్ సభ్యులు ఎండీ రఫిక్ అహ్మద్‌కు పుష్పగుచ్ఛాన్ని అందించి మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ కార్యక్రమంలో ఎంపీపీ ఆంథోనీ అలెగ్జాండర్, జెడ్పీటీసీ శ్రీనివాసరెడ్డి, ఖానాపూర్ ఆత్మ కమిటీ చైర్మెన్ కానూరి సతీష్, మండల ఎంపీటీసీల ఫోరం అధ్యక్షులు మల్లేష్, సర్పంచులు శ్రీకాంత్ యాదవ్, మేకల రాజారెడ్డి, లావణ్య తిరుపతి, కొప్పుల లక్ష్మి లచ్చన్న, కుర్ర లక్ష్మీ లక్ష్మణ్, ఎంపీటీసీలు కట్ల సింధుజ సాగర్, సుద్దాల లక్ష్మి జగన్, నర్సింగ్, రమేష్, దాసు నాయక్, అధికారులు ఏఈ లవ కుమార్ పాల్గొన్నారు.



రహదారి నిర్మాణానికి సర్వే

నవతెలంగాణ-బాసర

మండల కేంద్రంలో పోచమ్మ ఆలయం నుంచి సరస్వతిదేవి ఆలయం వరకు బైపాస్ రహదారి నిర్మాణానికి గురువారం ఆర్ అండ్ బి అధికారులు కొలతల సర్వే చేశారు. గ్రామీణ మౌలిక సదుపాయాల అభివృద్ధి నిధుల కింద సుమారు రూ.4 కోట్ల 50లక్షల నిధుల విడుదలకు కృషిచేసిన ఎమ్మెల్యే విఠల్‌రెడ్డికి సర్పంచ్ లక్ష్మణరావు కృతజ్ఞతలు తెలిపారు. మండలంలోని రహదారులు, మౌలిక సదుపాయాల కోసం ఎంతగానో కృషి చేస్తున్న ఎమ్మెల్యేకు మండల ప్రజలకు రుణపడి ఉంటారని సర్పంచ్ అన్నారు. కార్యక్రమంలో మాజీ ఎంపీటీసీ పోతన్న, వాడు సభ్యుడు కృష్ణ, స్థానిక నాయకులు పాల్గొన్నారు.



కండ్లు మూసుకుని నిరసన



నవతెలంగాణ-నార్నూర్

గత 46 సంవత్సరాలకు పైగా ఐసీడీఎస్‌లో అంగన్‌వాడీ కేంద్రంలో వివిధ సేవలందిస్తున్న తమకు ప్రభుత్వం వెంటనే తమ సమస్యలను పరిష్కరించాలని అంగన్‌వాడీ యూనియన్ మండల కమిటీ సభ్యురాలు సుభద్ర అన్నారు. గురువారం మండల కేంద్రంలో పొలాల పండుగా, ఉన్న తమ నిరసనను కొనసాగించారు. సమ్మెలో భాగంగా గురువారం కండ్లుమూసి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ మండల కమిటీ సభ్యురాలు మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26 వేలు అందజేయాలని అన్నారు. పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండు చేశారు. ఇప్పటికైనా ప్రభుత్వం తమ సమస్యలను పరిష్కరించాలని అన్నారు. సమ్మె కోసం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన టెంటును రెండు రోజుల కింద రాత్రి చింపి పారేసిన దండడుగులను పట్టి శిక్షించాలన్నారు. సమ్మెలో వివిధ గ్రామాల అంగన్‌వాడీలు జాదవ్ పంచపూల, రాథోడ్ సావిత్రి, రాథోడ్ స్యామక, పంచుబాయి, చాయ, మాయ, రత్న, మీరాబాయి, సునీత, రాధ, వివిధ గ్రామాల అంగన్‌వాడీలు ఉన్నారు.

బీసీ బంధుతో లబ్దిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలి

- జెడ్పీచైర్మెన్ జనార్ధన్ రాథోడ్

నవతెలంగాణ-నార్నూర్

తెలంగాణ ప్రభుత్వం ప్రవేశ పెట్టిన బీసీబంధుతో లబ్దిదారులు ఆర్థికంగా అభివృద్ధి చెందాలని జెడ్పి చైర్మెన్ జనార్ధన్ రాథోడ్ ఆకాంక్షించారు. గురువారం మండల కేంద్రంలో ఎంపీడీఓ కార్యాలయంలో బీసీ కులాల్లో కులవృత్తులు చేసుకునే వారికి రాష్ట్ర ప్రభుత్వం ద్వారా బీసీబంధు కింద లబ్దిదారులకు మంజూరైన చెక్కులను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్ని కులాల పేద ప్రజల కోసం రాష్ట్రంలో బీఆర్ఎస్ ప్రభుత్వం వివిధ సంక్షేమ పథకాలను తీసుకొచ్చిందని అన్నారు. పేద ప్రజల అభివృద్ధి ధ్యేయమే కేసీఆర్ ప్రభుత్వ లక్ష్యమని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీపీ కనక మోతుబాయి, వైస్ ఎంపీపీ చంద్రశేఖర్, స్థానిక సర్పంచ్ బానోత్ గజానంద్‌నాయక్, పీఏసీఎస్ ఇన్‌చార్జ్ చైర్మెన్ సురేష్ ఆడే, కోఆప్షన్ సభ్యులు దస్తగిర్, ఉమ్మడి నార్నూర్, గాదిగూడ మండలాల ఎంపీడీఓలు కావల రమేష్, రామేశ్వర్, ప్యాక్స్ డైరెక్టర్ దుర్గే కాంతారావు, కనక ప్రభాకర్, వివిధ గ్రామాల సర్పంచులు, బీఆర్ఎస్ నాయకులు పాల్గొన్నారు.

అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేత

నవతెలంగాణ-బాసర

కేంద్రమంత్రి రాష్ట్ర బీజేపీ అధ్యక్షుడు జి.కిషన్‌రెడ్డి అరెస్టుకు నిరసనగా మండల బీజేపీ నాయకులు గురువారం నిరసన తెలిపి, మండల కేంద్రంలోని అంబేద్కర్ విగ్రహానికి వినతిపత్రం అందజేశారు. బీజేపీ మండల అధ్యక్షుడు లక్ష్మారెడ్డి మాట్లాడుతూ తెలంగాణ ప్రభుత్వం నిరుద్యోగులకు ఇచ్చిన హామీ నిరుద్యోగ భృతి ఇవ్వడం లేదని, ప్రభుత్వ కార్యాలయాల్లోని ఖాళీలను భర్తీ చేయకపోవడంపై శాంతియుతంగా నిరసన తెలుపుతున్న బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డిని తెలంగాణ ప్రభుత్వం అక్రమంగా అరెస్టు చేయడాన్ని ఖండిస్తున్నామని అన్నారు. ప్రభుత్వం తక్షణమే నిరుద్యోగ భృతి ప్రకటించి, ఖాళీలను వెంటనే భర్తీ చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో బీజేవైఎం జిల్లా ప్రధాన కార్యదర్శి సాయినాథ్ పటేల్ డిమాండ్ చేశారు. కార్యక్రమంలో బీజేపీ పట్టణ అధ్యక్షులు జిడ్డు సుభాష్, సాయినాథ్, బిద్దూర్ రమేష్, దేవరాజు పాల్గొన్నారు.

16న కలెక్టరేట్ ఎదుట ధర్నాను జయప్రదం చేయాలి

నవతెలంగాణ-లక్ష్మణచాంద

16న కలెక్టరేట్ ఎదుట నిర్వహించే ధర్నాను జయప్రదం చేయాలని తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ జిల్లా కార్యదర్శి ఎస్.గంగన్న అన్నారు. గురువారం మండలంలోని బీడీ కార్మికులను కలిసి మాట్లాడారు. బీడీ పరిశ్రమలో పనిచేస్తున్న అన్ని కేటగిరిల కార్మికులందరికీ ఎలాంటి ఆంక్షలు లేకుండా రూ.2016 జీవన భృతి ఇచ్చి ఆదుకోవాలని అన్నారు. గత తొమ్మిది సంవత్సరాల నుంచి ఏ ఒక్క బీడీ కార్మికురాలుకు కొత్తగా జీవన భృతి రావడంలేదని అన్నారు. 2019లో ఎన్నికల్లో ఇచ్చిన హామీని మరిచిపోయి, మరోసారి ఎన్నికలలో మోసపూరితమైన వాగ్దానాలు చేయడానికి ముందుకొస్తున్నారని, ఇప్పుడు జీవన భృతి రాణి బీడీ కార్మికులు కేసీఆర్ మాటలు నమ్మలేని పరిస్థితిలో ఉన్నారని అన్నారు. వచ్చే ఎన్నికల్లో ఇచ్చిన వాగ్దానాన్ని అమలుపరిస్తేనే ఈ ఎన్నికల్లో కేసీఆర్‌కు ఓట్లు వేస్తారని అన్నారు. వెంటనే ఎలాంటి ఆంక్షలు లేకుండా అందరికీ జీవనభృతి ఇవ్వాలని డిమాండ్ చేశారు. తెలంగాణ ప్రగతిశీల బీడీ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో ఈ నెల 16న జిల్లా కలెక్టర్ కార్యాలయం ముందు ధర్నా నిర్వహిస్తున్నామని ఈ ధర్నాకు కార్మికులందరూ అధిక సంఖ్యలో పాల్గొని జయప్రదం చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో లక్ష్మి, భారతీ, జమున, కవిత, గంగామణి పాల్గొన్నారు.

టెట్ అభ్యర్థుల కోసం ఆర్టీసీ ప్రత్యేక బస్సులు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

టెట్ పరీక్ష రాసే అభ్యర్థుల కోసం ఆదిలాబాద్ జిల్లా కేంద్రం నుంచి మంచిర్యాల, నిజామాబాద్‌లకు ఈనెల 15న ఉదయం 4 గంటలకు ప్రత్యేక బస్సులు ఏర్పాటు చేస్తున్నట్టు డిప్యూటీ ఆర్ఎం ప్రణీత్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ముందస్తు రిజర్వేషన్ కోసం బస్టాండ్ కౌంటర్‌లో లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.టీఎస్‌ఆర్టీసీఆన్‌లైన్.ఇన్ లో రిజర్వేషన్ చేసుకోవచ్చని పేర్కొన్నారు. పరీక్ష కేంద్రాలు ఉన్న వివిధ ప్రాంతాలకు బస్సు సౌకర్యం కావాల్సినవారు 7382840334 సంప్రదించాలని సూచించారు.

కిషన్‌రెడ్డి అక్రమ అరెస్టును ఖండిస్తూ నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విద్యార్థులు, యువత, నిరుద్యోగుల భవిష్యత్తుతో 9 ఏండ్లుగా చెలగాటం ఆడుతున్న కేసీఆర్ సర్కార్ తీరును ప్రశ్నిస్తూ తెలంగాణ బీజేపీ నిర్వహిస్తున్న 24 గంటల ఉపవాస దీక్షను బగ్నం చేసి, బీజేపీ రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డిని నాయకులను పోలీసులు అక్రమంగా అరెస్టు చేయడాన్ని తీవ్రంగా ఖండిస్తున్నట్టు బీజేపీ జిల్లా అధ్యక్షుడు పాయల్ శంకర్, బీజేపీ రాష్ట్ర నాయకురాలు సుహాసినిరెడ్డి తెలిపారు. అక్రమ అరెస్టును ఖండిస్తు గురువారం స్థానిక వినాయకచౌక్‌లో బీజేపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ తెలంగాణ ప్రజల ఆశలను అడుగడుగునా నిర్వీర్యం చేస్తూ, నిరుద్యోగులను అరిగోసా పెడుతూ, ఉద్యోగ నోటిఫికేషన్లు ఇవ్వక, ఇచ్చిన నోటిఫికేషన్లు సక్రమంగా నిర్వహించక యువకుల బ్రతుకులను కేసీఆర్ ప్రభుత్వం ఆగం చేసిందని మండిపడ్డారు. అన్యాయాలపై, అక్రమాలపై ప్రశ్నిస్తే ఎదురుతిరిగితే అణచివేయడం, శాంతియుతంగా నిరసన దీక్షలు నిర్వహిస్తుంటే అడ్డుకునే ఏకైక ప్రభుత్వం బీఆర్ఎస్ ప్రభుత్వమన్నారు. రాబోయే ఎన్నికల్లో బీఆర్ఎస్‌ను చిత్తుచిత్తుగా ఓడించాలన్నారు. కార్యక్రమంలో నాయకులు లోక ప్రవీణ్‌రెడ్డి, జోగు రవి, గంగారెడ్డి, రఘుపతి, దినేష్ మటోలియ, వేదవ్యాస్, మయూరి చంద్ర, రత్నాకర్ రెడ్డి, రాకేష్, స్వామిరెడ్డి, సూర్య కిరణ్, మహేందర్, శ్రీనివాస్ ఉన్నారు.

పండుగలు శాంతియుతంగా నిర్వహించుకోవాలి

- ఆదిలాబాద్ కలెక్టర్ రాహుల్ రాజ్



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

గణేష్ ఉత్సవాలను శాంతియుతంగా, సమన్వయంతో ఘనంగా నిర్వహించాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో హిందూ ఉత్సవ కమిటీ సభ్యులు, అధికారులు, మత పెద్దలతో జిల్లా ఎస్పీతో కలిసి వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకల నిర్వహణపై శాంతి కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వినాయక నవరాత్రి ఉత్సవ వేడుకలను జిల్లాలో ప్రశాంత వాతావరణంలో సామరస్య పూర్వకంగా నిర్వహించుకోవాలని సూచించారు. పోలీస్, విద్యుత్, మున్సిపల్, తదితర శాఖల అధికారులు సంయుక్తంగా పరిశీలన చేసి వివిధ ప్రాంతాలలో ఏర్పాటు చేసే గణేష్ మండళ్లకు అవసరమైన సౌకర్యాలు కల్పించాలని అన్నారు. పారిశుద్యం, తాగునీరు, మొబైల్ టాయిలెట్, గుంతలు పూడ్చడం వంటి సౌకర్యలు కల్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. రోడ్లపై పశువులను వదలకూడదని, నిబంధనల ప్రకారం చర్యలు తీసుకోవడం జరుగుతుందని హెచ్చరించారు. మండపాల వద్ద విద్యుత్ ప్రమాదాలు సంభవించకుండా లూస్ వైర్లను సరిచేయాలని, నిరంతరం విద్యుత్ సరఫరా అందిస్తూ పర్యవేక్షించాలని విద్యుత్‌శాఖ అధికారులను ఆదేశించారు. నిమజ్జనం రోజుల్లో పెన్ గంగా, చాంద వద్ద అవసరమైన క్రేన్‌లు, విద్యుత్, ఇతర సౌకర్యాలు కల్పించాలని, షిఫ్టుల వారిగా విధులు కేటాయించాలని అధికారులను ఆదేశించారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా పట్టణంలోని ముఖ్య కూడళ్లలో వైద్య శిబిరాలు నిర్వహించాలని, అంబులెన్సు, అగ్నిమాపక వాహనాలు అందుబాటులో ఉంచాలని అన్నారు.

పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేస్తాం..

ఎస్పీ డి.ఉదయ్ కుమార్ రెడ్డి మాట్లాడుతూ ఈ నెల 18 నుంచి 28 వరకు జిల్లాలో నిర్వహించే వినాయక ఉత్సవాలను పండుగ వాతావరంగంలో నిర్వహించుకోవాలని అన్నారు. గత అనుభవాలను దృష్టిలో ఉంచుకొని పోలీస్ శాఖ ద్వారా అవసరమైన అన్ని చర్యలు తీసుకోవడం జరుగుతుందని అన్నారు. ఎలాంటి సంఘటలు జరుగకుండా గట్టి పోలీస్ బందోబస్తు ఏర్పాటు చేయడం జరుగుతుందని తెలిపారు. ప్రతి గణేష్ మండపానికి నిర్వాహకులు అనుమతి పొందాలని, సీసీ కెమెరాలను ఏర్పాటు చేసుకోవాలని సూచించారు. ఉత్సవ కమిటీ సభ్యులు మాట్లాడుతూ గణేష్ ఉత్సవాల నిర్వహణకు అవసరమైన ఏర్పాట్లపై వివరించారు. అనంతరం మట్టి వినాయకుని ప్రతిష్ఠించాలని కాలుష్య నియంత్రణ మండలి పంపిణీ చేయబడిన పోస్టర్‌ను కలెక్టర్, ఎస్పీ, అధికారులు, ఉత్సవకమిటీ సభ్యులు ఆవిష్కరించారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు ఖుష్బు గుప్త, శ్యామలాదేవి, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, ఆర్డీఓ స్రవంతి, డీఎస్పీ ఉమేందర్, మున్సిపల్ కమీషనర్ శైలజ, బీసీ సంక్షేమ అధికారి రాజలింగం, వివిధ శాఖల అధికారులు, ఉత్సవ కమిటీ సభ్యులు, వివిధ మతాల పెద్దలు, పోలీస్ అధికారులు పాల్గొన్నారు.

రైతును నిండా ముంచిన పురుగులమందు

- నాలుగు ఎకరాల్లో వాడిపోయిన పత్తిపంట
- న్యాయం చేయాలని రైతు ధర్నా



నవతెలంగాణ-ఇచ్చోడ

కొండ నాలుకకు మందు పెడితే ఉన్న నాలుక ఊడినట్టు, రైతు తన వ్యవసాయక్షేత్రంలోని పంట ఏపుగా పెరిగింది, అధిక దిగుబడి రావాలని పత్తి పంటపై పురుగుమందు స్ప్రే చేయగా, నాలుగు ఎకరాలు పత్తి పంట వాడిపోయి ఉండటాన్ని గమనించిన రైతు బాధ మాటల్లో చెప్పలేనిది. అలాంటి సంఘటన గురువారం ఇచ్చోడ మండలంలోని సాథ్‌నంబర్ గ్రామానికి చెందిన రాథోడ్ దూద్‌రామ్ చేనులో జరిగింది. మండల కేంద్రంలోని ఓ పెస్టిసైడ్ దుకాణంలో కొనుగోలు చేసిన పురుగులమందును తన పత్తిపంటపై స్ప్రే చేయగా పత్తిపంట పూర్తిగా ఆడిపోయింది. దీంతో బాధిత రైతు దుకాణం ఎదుట ఆడిపోయిన పత్తికర్రలతో, స్ప్రే చేసిన మందుడబ్బాతో కొనుగోలు చేసిన పెస్టిసైడ్స్ దుకాణం ముందు ఆడిపోయిన పత్తి కర్రలు, స్ప్రే చేసిన మందు డబ్బను పట్టుకొని ధర్నా చేశాడు. తనకు న్యాయం చేయాలని డిమాండ్ చేశాడు. రైతుకు మద్దతుగా రైతులు అక్కడి చేరుకొని, పలు సంఘాల నాయకులు మద్దతుతో దుకాణం ముందే రాస్తా రోకో నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు మాట్లాడుతూ ఇచ్చోడలోని ప్రయివేట్ పెస్టిసైడ్స్ దుకాణంలో సగం లీటర్, చొప్పున లీటర్ బయోమందు తీసుకవెళ్లిన, మంగళవారం, బుధవారంలో నాలుగు ఎకరాల పత్తిపంటపై పిచికారి చేసినట్టు తెలిపారు. గురువారం ఉదయం చెనులోకి వెళ్లి చూడగా నాలుగు ఎకరాల పంట ఆడిపోయి ఉందని పేర్కొన్నాడు. ఇంకో ఎకరం పత్తి బాగుందని, ఆరోజు స్ప్రే చేస్తున్న సమయంలో తెచ్చిన మందు అయిపోయిందని తెలిపారు. నష్టం జరిగిన నాలుగు ఎకరాల పత్తి పంటకు నష్ట పరిహారం చెల్లించే వరకు ధర్నా చేస్తాని తేల్చిచెప్పగా, అగ్రికల్చర్ యూనియన్ నాయకులు, ఏఓ కైలాస్ వచ్చి పత్తిపంట పూర్తిగా కోలుకొనేవరకు చర్యలు తీసుకుంటామని, కోలుకొని సందర్భంలో నష్టపరిహారం అందే విధంగా కృషి చేస్తామని యూనియన్ నాయకులకు హామీ ఇవ్వడంతో ధర్నా విరమించారు.

ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగుల సమ్మె తాత్కాలికంగా వాయిదా



నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

ఎన్‌హెచ్‌ఎం పరిధిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ ఉద్యోగులు తమ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్ చేస్తే తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయీస్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట గత 11 రోజుల నుంచి చేపడుతున్న సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి నవీన్ కుమార్ తెలిపారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించేందుకు చేపడుతున్న సమ్మె పట్ల ప్రభుత్వం స్పందించిందని, తమ సమస్యలను పరిష్కారం చేయటానికి సిద్దంగా ఉన్నట్లు డైరెక్టర్ ఆఫ్ హెల్త్ డా.శ్రీనివాస్‌రావు హామినివ్వడంతో ఈ సమ్మెను తాత్కాలికంగా వాయిదా వేస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా సమ్మె శిబిరం వద్ద గురువారం జిల్లా వైద్యారోగ్యశాఖాధికారి డా.నరేందర్ రాథోడ్‌కు సీఐటీయూ జిల్లా కార్యదర్శి అన్నమొల్ల కిరణ్, యూనియన్ కార్యదర్శి నవీన్ కుమార్ సమ్మె వాయిదా పత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం పీఆర్సీ ప్రకారం కనీస వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. ఉద్యోగులందరికి వారి క్యాడర్ ప్రకారం వైద్యారోగ్య శాఖలోని పర్మినెంట్ ఉద్యోగుల బేసిక్ అలవెన్సులు నిర్ణయించాలని అన్నారు. సుప్రీం కోర్టు తీర్పు ప్రకారం సమాన పనికి సమాన వేతనం అమలు చేయాలని అన్నారు. తమ సమస్యలను పరిష్కరించని నేపథ్యంలో తిరిగి సమ్మె తేదీని ప్రకటిస్తామని తెలిపారు. కార్యక్రమంలో ఎన్‌హెచ్‌ఎం ఉద్యోగులు ఉన్నారు.

ఘనంగా సీపీఐ 75వ వార్షికోత్సవ సభ



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

మావల మండలంలోని న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీలో గురువారం సీపీఐ 75 వార్షికోత్సవం సందర్భంగా సీపీఐ జిల్లా కార్యదర్శి ముడుపు ప్రభాకర్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ముందుగా తెలంగాణ సాయుధ పోరాట అమరవీరులకు జోహార్లు అర్పించారు. వారి త్యాగాన్ని నేటి తరానికి తెలియజేయడమే సీపీఐ లక్ష్యంగా పెట్టుకొని ప్రజల్లోకి వెళ్లి తెలియజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి యువతకు వాటి చరిత్ర వారి త్యాగాలు తెలంగాణ, రైతాంగ సాయుధ పోరాట పిలుపు నేటికీ 75 సంవత్సరాల అయినప్పటికీ సీపీఐ నేటికీ భూ సమస్యల పరిష్కారం కోసం పోరాడుతూనే ఉన్నాయని అన్నారు. ఆనాడు లక్షల ఎకరాలను పేదవాళ్లకు పంచిపెడితే నేడు తిరిగి కేసీఆర్ ప్రభుత్వం పెత్తందారుల కట్టబెట్టడానికి ధరణి పేరుతో దగా చేస్తుందని అన్నారు. పేదవాడికి ఇంటి స్థలాలు లేవు, పేదవాడికి గూడు లేదని అన్నారు. ఆనాటి సాయిధ పోరాటంతో సాధించుకున్నారు. ఈ సమస్యలు త్యాగాలు తెలుసుకోవడానికి 17న మధ్యాహ్నం రెండు గంటలకు ఎగ్జిబిషన్ గ్రౌండ్‌లో పెద్ద బహిరంగ సభ ఉంటుందని అన్నారు. ఈ బహిరంగ సభకు జాతీయ ప్రధాన కార్యదర్శి డి రాజా, జాతీయ నాయకులు కార్యదర్శి, జాతీయ కార్యవర్గ సభ్యులు చాడ వెంకరెడ్డి. సీపీఐ తెలంగాణ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు పాల్గొంటారని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో సీపీఐ జిల్లా కార్యవర్గ సభ్యులు కుంటాల రాములు. సీపీఐ జిల్లా కౌన్సిల్ సభ్యులు జిల్లా అధ్యక్షులు అయిన అర్థాంగి రమేష్, దళిత సంఘం బీహెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షులు కామ్లే రాందాస్, దత్తు, కవిత, వర్ష న్యూహౌసింగ్ బోర్డ్ కాలనీ వాసులు పాల్గొన్నారు.

మండల సర్వసభ్య సమావేశం వాయిదా

నవతెలంగాణ-కడెం

మండల కేంద్రంలోని రైతువేదిక భవనంలో గురువారం నిర్వహించనున్న మండల సర్వసభ్య సమావేశం టెట్ పరీక్షల కారణంగా రద్దు చేసినట్టు కడెం ఎంపీపీ అలెగ్జాండర్ తెలిపారు. సర్వసభ్య సమావేశానికి మండల పలు శాఖల అధికారులకు టెట్ పరీక్షల నేపథ్యంలో సంబంధిత అధికారి రిపోర్ట్ చేయల్సి ఉండగా అధికారులు అందుబాటులో ఉండరని మండల పాలకవర్గం సభ్యులు సర్పంచులు, ఎంపీటీసీలు హాజరు అయినప్పటికీ సర్వసభ్య సమావేశాన్ని తాత్కాలికంగా వాయిదా వేశామని మళ్లీ ఎప్పుడు సమావేశం నిర్వహిస్తామనేది త్వరలో తెలియజేస్తామని ఎంపీపీ అలెగ్జాండర్ పేర్కొన్నారు.

చెవిలో పువ్వులు పెట్టుకొని సమగ్రశిక్ష ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ విద్యాశాఖ సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారంతో ఈ సమ్మె 17వ రోజుకు చేరుకుంది. సమ్మె శిబిరంలో ఉద్యోగులందరు చెవిలో పువ్వులు పెట్టుకొని తమ నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ఉద్యోగులు మాట్లాడుతూ మినిమం టైం పేస్కేల్ కల్పించాలని కోరారు. రూ.10లక్షల జీవితబీమా, ఆరోగ్యబీమాను కల్పించాలని డిమాండ్ చేశారు. ఓ వైపు ప్రభుత్వం వివిధ శాఖల్లోని కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులర్ చేస్తుంటే, విద్యార్హతలు, అనుభవం ఉన్న సమగ్రశిక్షలోని ఉద్యోగుల పట్ల వివక్ష చూపడం ఆవేదన కలిగిస్తోందని అన్నారు. గత రెండు వారాల నుంచి నిరసన చేపడుతున్న ప్రభుత్వం స్పందించకపోవడం సిగ్గుచేటన్నారు. తమ న్యాయ సమ్మతమైన డిమాండ్లను నెరవేర్చేవరకూ తమ పోరాటం సాగిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో సమగ్ర శిక్ష ఉద్యోగులు ఉన్నారు.

గుడుంబాను తయారు చేసినా విక్రయించినా కఠిన చర్యలు

- ఎక్సైజ్ ఎస్సై రవికుమార్

నవతెలంగాణ-కడెం

నిషేధిత గుడుంబాను తయారు చేసిన విక్రయించిన కఠిన చర్యలు తప్పవని ఎక్సైజ్ ఎస్సై రవికుమార్ అన్నారు. గురువారం మండలంలోని చిట్యాల్ గ్రామంలోని గుడుంబా స్థావరాలపై ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై వివరాలు వెల్లడించారు. నిషేధిత గుడుంబా విక్రయిస్తున్న ఇద్దరు మహిళలను పట్టుకొని వారి వద్ద నుంచి 10 లీటర్ల గుడుంబాను స్వాధీనం చేసుకున్నామని అన్నారు. వారిపై కేసులు నమోదు చేసి, స్థానిక తహసీల్దార్ రాజేశ్వరి ఎదుట బైండోవర్ చేసినట్టు తెలిపారు. అనంతరం వారికి అందిన సమాచారం మేరకు లక్ష్మీసాగర్ గ్రామంలో తనిఖీలు చేయగా ఆ గ్రామానికి చెందిన కొరెపెల్లి రంజిత్ కుమార్ గుడుంబా అమ్ముతుండగా పట్టుకుని సుమారు ఐదు లీటర్లు గుడుంబా స్వాధీనం చేసుకుని, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. నిషేధిత గుడుంబా అమ్మిన రవాణా చేసిన తయారు చేసిన కఠిన చర్యలు తప్పవన్నారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ సిబ్బంది పాల్గొన్నారు.

బంధులపై శ్వేత పత్రం విడుదల చేయాలి

నవతెలంగాణ-ముథోల్

ముథోల్ నియోజకవర్గంలో అమలవుతున్న దళిత, బీసీ, మైనార్టీబంధులపై ప్రభుత్వం శ్వేతపత్రం విడుదల చేయాలని తెలంగాణ జనసమితి ముథోల్ నియోజకవర్గం ఇన్‌చార్జి సర్దార్ వినోద్ కుమార్ డిమాండ్ చేశారు. గురువారం నియోజకవర్గ కేంద్రంమైన ముథోల్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. అధికార పార్టీ కార్యకర్తలకు దళిత, బీసీ, మైనార్టీబంధులు ఇవ్వటం సరికాదన్నారు. అర్హులకు బంధులు ఇవ్వాలని కోరారు. లేని యెడల ఆందోళన కార్యక్రమాలను ఉధృతం చేస్తామని హెచ్చరించారు. అనంతరం ముథోల్ మండల తెలంగాణ జనసమితి అధ్యక్షుడుగా మండలంలోని ఆష్ట గ్రామానికి చెందిన ఎస్‌కే మీనాజ్, గిరిజన విభాగం ముథోల్ మండల అధ్యక్షుడుగా విట్టోలి తండా గ్రామానికి చెందిన రాథోడ్ శ్రీనివాస్‌నాయక్‌ను నియమించినట్టు ఆయన ప్రకటించారు. ఈ సమావేశంలో టీజేఎస్ రాష్ట్ర కార్యదర్శి పల్లపు తులసిరాం, నాయకులు అశోక్, పాషా పాల్గొన్నారు.

ఘనంగా హిందీ దినోత్సవం

నవతెలంగాణ-నార్నూర్

మండలంలోని జామడ సైన్స్ మోడల్ బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలలో గురువారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ముందుగా విద్యార్థినులకు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు నెహ్రూ దేశ రెండో రాజభాష అయిన హిందీ రాజభాష గురించి వివరించారు. అనంతరం హిందీ ఉపాధ్యాయులు రాథోడ్ హరిచంద్, ముక్తాలను ఇద్దరినీ శాలువాతో సన్మానించారు.అనంతరం మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో గురువారం 75వ హిందీ భాషా దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపల్ మహేందర్ కుమార్ మాట్లాడుతూ హిందీ భాష కేవలం మన జాతీయ భాషనే కాదని, జాతీయ సమైక్యత కాపాడే భాష అని అన్నారు. ఇది దేశాన్ని ఏకతాటిపై నడిపించే భాష అని పేర్కొన్నారు. అందరూ తమ కర్తవ్యంగా భావించాలని అన్నారు. అనంతరం హిందీ అధ్యాపకులు బాలాజీ కాంబ్లేను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో అధ్యాపకులు కే.వెంకటరమణ, పి.ఉదయ్ కుమార్, ఎల్.సుజాత, డి.సుజాత, సిహెచ్ పుష్ప, వైష్ణవి, హెచ్ జలంధర్, శివ ప్రసాద్ , పీడీ విశ్వనాథ్ ఉపాధ్యాయులు జాదవ్ శివాజీ, ప్రేమ్‌కుమార్, వార్డెన్ మల్లు, గంగాధర్ రజనీకాంత్, రవీందర్ ఉన్నారు.

వినాయక ఉత్సవాలను శాంతియుతంగా నిర్వహించుకోవాలి

నవతెలంగాణ-బజార్‌హత్నూర్

వినాయక ఉత్సవాలను శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని ఎస్సై నరేష్ అన్నారు. గురువారం మండలంలోని గణేష్ ఉత్సావాల నిర్వహణ కమిటీ సభ్యులకు, గ్రామ యువకులకు శాంతిభద్రతలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తొమ్మిది రోజుల పాటు నిర్వహించే గణేష్ ఉత్సావాల నేపథ్యంలో పోలీస్ బందోబస్తు, ముందస్తు జాగ్రత్త చర్యలు చేపట్టాలన్నారు. మండపాల వద్ద ప్రతిరోజు ఆర్గనైజింగ్ కమిటీ నుంచి ఒకరు బాధ్యతగా ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. మండపాల సమీపంలో పేకాట, అసభ్యకర డ్యాన్సులు వంటి అసాంఘీక కార్యక్రమాలు జరగకుండా చూడాలని అన్నారు. గణేష్ విగ్రహల ఏర్పాటులో సంబంధిత శాఖల అనుమతి, నిబంధనలు ఖచ్చితంగా పాటించాలని సూచించారు. వినాయక నిమజ్జనం చివరి రోజు లైటింగ్, బారికేడ్స్, ఫస్ట్‌ఎయిడ్, పోలీస్ హెల్ప్‌లైన్ సెంటర్‌లు ఏర్పాటు చేయాలని సూచించారు. ఈ ఉత్సవాలలో తప్పనిసరిగా భక్తులు మట్టి విగ్రహాలతో పూజలు నిర్వహించాలని అన్నారు. మట్టి విగ్రహాలతో పర్యావరణాన్ని కాపాడినవారు అవుతారని అన్నారు. మట్టి నిమజ్జనంతో నీరు కూడా కలుషితం కాకుండా ఉంటుందని పేర్కొన్నారు. ఈ విషయంలో ఉత్సవ కమిటీ నిర్వహకులు సరైన నిర్ణయం తీసుకొని తప్పనిసరిగా మట్టి విగ్రహాలతోనే ఉత్సవాలు నిర్వహించాలని సూచించారు. ఈ కార్యక్రమంలో పోలీస్ సిబ్బంది, వినాయక మండపాల నిర్వాహకులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

నార్నూర్ : వినాయక చవితిని అన్ని గ్రామాల ప్రజలు భక్తిశ్రద్ధలతో శాంతియుత వాతావరణంలో నిర్వహించుకోవాలని గురువారం ఎస్సై రవికిరణ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వినాయక మండపంలో విద్యుత్ దీపాలకు, మైక్ పర్మిషన్‌కు తప్పనిసరిగా విద్యుత్‌శాఖ నుంచి అనుమతి తీసుకోవాలని, గ్రామపంచాయతీ లేదా మీసేవ నుండి చెల్లించిన డీడీని అవసరమైనటువంటి అన్ని వివరాలు వినాయక మండప కమిటీ సభ్యుల వివరాలు అన్నింటిని ఆన్‌లైన్‌లో అప్లై చేసుకోవాలని సూచించారు. ఆన్‌లైన్ కాపీని పోలీస్ స్టేషన్‌లో అందించిన వారికి మాత్రమే అనుమతి ఇవ్వడం జరుగుతుందన్నారు. వినాయక మండప కమిటీ సభ్యులు త్వరితగతిన ఆన్‌లైన్‌లో అప్లై చేసిన కాపీని పర్మిషన్ కొరకు పోలీస్ స్టేషన్‌లో అందజేయాలని సూచించారు.

బ్యాంకు సేవలపై ప్రజలకు అవగాహన

నవతెలంగాణ-కాగజ్‌నగర్



కాగజ్‌నగర్ మండలం చింతగూడ కోయవాగులో నాబార్డ్ ఆదేశాలతో బ్యాంక్ సేవలపై ప్రజలకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా తెలంగాణ గ్రామీణ బ్యాంక్ మేనేజర్ జాన్ మాట్లాడుతూ గ్రామీణ బ్యాంక్ ద్వారా ప్రజలకు ఎన్నో ఆర్థిక ప్రయోజనాలు ఉంటాయని తెలిపారు. రైతులకు రుణాలు, వ్యాపారం చేసే వారికి వారి అర్హతలను బట్టి రుణాలు మంజూరు చేస్తామని తెలిపారు. గ్రామస్థుడు, తెలంగాణ మహార్ సంఘం రాష్ట్ర అధ్యక్షులు జాడి దీపక్ మాట్లాడుతూ బ్యాంక్ అధికారులకు తాము సహకరిస్తామని, తమ గ్రామస్థులకు ప్రయోజనాలు సమకూర్చి ఆర్థికంగా లబ్ది జరిగేలా చూడాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ చింతపురి మల్లేష్‌తో పాటు గ్రామస్థులు పాల్గొన్నారు.

శరీర, మానసిక ఉల్లాసానికి నృత్యం అవసరం

నవతెలంగాణ-ఆసిఫాబాద్



చిన్నతనం నుండే నృత్యం నేర్చుకోవడం వల్ల శారీరక మానసిక ఉల్లాసం పెరుగుతుందని ఎమ్మెల్యే ఆత్రం సక్కు అన్నారు. జిల్లా కేంద్రంలోని రాజంపేటలో ఏర్పాటుచేసిన డీఎస్ డాన్స్ అకాడమీని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ డాన్స్ చేయడం వల్ల శరీరంలోని భాగాలకు వ్యాయామం జరుగుతుందన్నారు. దీనితో పాటు మానసిక ఆనందం పొందే అవకాశం కూడా ఉంటుందన్నారు. డాన్స్ అకాడమీ ఏర్పాటు చేసిన నిర్వాహకున్ని అభినందించారు. ఈ కార్యక్రమంలో డాన్స్ అకాడమీ నిర్వాహకుడు శ్రీకాంత్, సీనియర్ డాన్స్ మాస్టర్ ప్రశాంత్, నాయకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

పచ్చగడ్డి తింటూ అంగన్‌వాడీల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

తమ న్యాయమైన డిమాండ్ల పరిష్కారం చేయాలని అంగన్‌వాడీలు కలెక్టరేట్ ఎదుట సీఐటీయూ ఆధ్వర్యంలో చేస్తున్న నిరసన దీక్షలో నాలుగో రోజు పచ్చ గడ్డి తింటూ నిరసన తెలిపారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పెరుగుతున్న ధరలకు అనుకూలంగా కనీస వేతనం రూ.26,000 ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించాలని కోరారు. అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలన్నారు. హెల్పర్లకు ఐదు లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ చెల్లించాలన్నారు. వేతనంలో సగం పెన్షన్స్ నిర్ణయించాలన్నారు. అంగన్‌వాడీ టీచర్లకు రూ.10 లక్షలు రిటైర్మెంట్ బెనిఫిట్స్ ఇవ్వాలని, ప్రమాద బీమా సౌకర్యం ఐదు లక్షలు చెల్లించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న 10 సంవత్సరాల టీఏ డీఏలు తక్షణమే విడుదల చేయాలన్నారు. ప్రభుత్వం అంగీకరించిన హామీలు కూడా నెరవేర్చకపోవడం దారుణమని, పండగ రోజు తమను పస్తులు ఉంచి పచ్చగడ్డి తినేలా చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సమస్యలు పరిష్కారం అయ్యేంతవరకు సమ్మెను కొన్ని కొనసాగిస్తామని, రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే సమస్యలు పరిష్కారానికి చొరవ తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సంఘం నాయకులు భార్గవి, హలిమ్మ, ఇందిరా, అంబిక, విజయ, వరలక్ష్మి, పుష్పలత, సరోజన పాల్గొన్నారు.



ఆసిఫాబాద్‌లో గడ్డి తింటూ అంగన్‌వాడీల నిరసన

దహెగాం : ప్రభుత్వం మెడలు వంచైనా సరే అంగన్‌వాడీల హక్కులను సాధిస్తామని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్(సీఐటీయూ) రాష్ట్ర అధ్యక్షురాలు త్రివేణి అన్నారు. మండలకేంద్రంలోని స్థానిక తహసీల్దార్ కార్యాలయం ఎదుట నిర్వహిస్తున్న నాల్గవ రోజు సమ్మె శిబిరాన్ని సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి ముంజం శ్రీనివాస్‌తో కలిసి చెవిలో పువ్వులు పెట్టుకొని నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీలను చిన్నచూపు చూడడం మానుకోవాలన్నారు. ఎన్నో ఏండ్లుగా చాలీచాలని వేతనాలతో సేవలందిస్తున్న ప్రభుత్వం పట్టించుకోకపోవడం దారుణమన్నారు. గర్భిణీలు, బాలింతలు, కిశోర బాలికలు, చిన్న పిల్లలకు సేవలందించడంతో పాటు ఎన్నికల ప్రక్రియలో ప్రధాన ఘట్టమైన ఓటరు జాబితా తయారీలోనూ అంగన్‌వాడీల సేవలను వినియోగించుకుంటున్న ప్రభుత్వం వారికి ఉద్యోగభద్రత కల్పించడంతో నిర్లక్ష్యంగా వ్యవహరించడం సిగ్గుచేటన్నారు. వెంటనే అంగన్‌వాడీల వేతనాలను రూ.26 వేలు పెంచాలని, పెన్షన్, ఈఎస్ఐ కల్పించాలన్నారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాడ్యుటీ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం గురువారం సమ్మె శిబిరంలో ఫ్లెక్సీలు చింపిన వ్యక్తిపై చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్స్ యూనియన్ జిల్లా నాయకురాలు వజ్రమ్మతో పాటు రూప, ఈశ్వరి, పద్మ, జయ, విజయ పాల్గొన్నారు.

బెజ్జూర్ : అంగన్‌వాడీ టీచర్లకు కనీస వేతనం ఇవ్వాలని అంగన్‌వాడీలు డిమాండ్ చేశారు. గురువారం మండలకేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ముందు నిరవధిక సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ టీచర్ల సమ్మె నాల్గవ రోజుకు చేరుకుంది. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించే వరకు తమ పోరాటం కొనసాగుతుందని హెచ్చరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్లు సత్యశ్రీ, విమల, శారద, దుర్గాదేవి, స్వప్న, రమాశ్రీ, తిరుపతమ్మ, అంగన్‌వాడీ టీచర్లు, ఆయాలు పాల్గొన్నారు.

సిర్పూర్(టి) : అంగన్‌వాడీ ఉద్యోగుల నిరవధిక సమ్మె గురువారం నాటికి నాల్గవ రోజుకు చేరుకుంది. నిరసనలో భాగంగా శిబిరంలో వర్షపు నీటితో నిండినప్పటికీ వారు ఒంటి కాలుపై నిలబడి నిరసన వ్యక్తం చేశారు., అంగన్‌వాడీ ఉద్యోగులను పర్మినెంట్ చేయాలని, కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగభద్రత, సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం వేతనాలు చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ టీచర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు ఉమాదేవి, అర్చన, విమల, శాంత, సరస్వతి, హేమలత, వనమాల, జ్యోతి పాల్గొన్నారు.

పెంచికల్‌పేట్ : మండల కేంద్రంలోని తహసీల్దార్ కార్యాలయం ఎదుట అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న నిరవధిక సమ్మెకు మద్దతుగా బీఎస్పీ నాయకులు మద్దతు తెలిపారు. గురువారం మండల అధ్యక్షుడు దేవాజీ నాయకులతో కలిసి మద్దతు తెలిపి దీక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీఎస్పీ రాష్ట్ర అధ్యక్షుడు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ సిబ్బంది చేస్తున్న రిలే నిరాహార దీక్షకు మద్దతు తెలియజేశామన్నారు. అంగన్‌వాడీల న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం నెరవేర్చాలన్నారు. తాము అధికారంలోకి వస్తే కాంట్రాక్టు ఉద్యోగులను పర్మినెంట్ చేస్తామని, కనీస వేతనం అమలు చేస్తామన్నారు. కార్యక్రమంలో బీఎస్పీ నాయకులు పాగిడె ఆశన్న, రవికుమార్, మొండి, వినోద్ పాల్గొన్నారు.



బెజ్జూర్ : సమ్మెలో పాల్గొన్న అంగన్‌వాడీలు



దహెగాం : సమ్మెలో నిరసన తెలుపుతున్న అంగన్‌వాడీలు



సిర్పూర్(టి) : ఒంటికాలుపై నిరసన తెలుపుతున్నఅంగన్‌వాడీలు



సిర్పూర్(టి) : అంగన్‌వాడీలకు బీఎస్పీ నాయకుల మద్దతు

ఘనంగా హిందీ భాషా దినోత్సవం

నవతెలంగాణ-దహెగాం

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఎన్ఎస్ఎస్ ఆధ్వర్యంలో గురువారం హిందీ దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ అమరేందర్ సార్ మాట్లాడుతూ జాతీయ భాష అయిన హిందీ యొక్క ప్రాధాన్యతను, ఆవశ్యకతను చక్కగా వివరించారు. అనంతరం హిందీ అధ్యాపకులు ఆనంద్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్ నోముల చంద్రశేఖర్ అధ్యాపకులు గణపతి, మహేందర్, బావాజీ, మధుకర్, మోహన్ దాస్, శాంభవి పాల్గొన్నారు.

జైనూర్ : మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో హిందీ భాషా దినోత్సవాన్ని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. గురువారం ప్రిన్సిపల్ శ్రీదేవి, కళాశాల బృందం ఆధ్వర్యంలో హిందీ అధ్యాపకుడు ప్రకాష్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ శ్రీదేవి మాట్లాడుతూ జాతీయ ఐక్యతను చాటిచెప్పింది హిందీ భాషాయేనన్నారు. భారతదేశంలో ఏ మూలకుపోయిన స్వాతంత్ర్యం సాధించిన నాటి నుండి నేటి వరకు హిందీ భాష ప్రతి రాష్ట్రంలో ఉందన్నారు. పిల్లలకు హిందీ భాషలో నాణ్యమైన విద్యనందిస్తున్న హిందీ అధ్యాపకుడిని అభినందించారు. రాబోయే రోజుల్లో పిల్లలకు నాణ్యమైన విద్యనందించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు సరస్వతి, వెంకటేశ్ పాల్గొన్నారు.

వైద్యులను సన్మానించిన ఎక్స్ ఆర్మీ సభ్యులు

నవతెలంగాణ-కాగజ్‌నగర్

కాగజ్‌నగర్ పట్టణంలోని పలువురు వైద్యులను గురువారం ఎక్స్ ఆర్మీ సర్వీసెస్ అసోషియేషన్ సభ్యులు సన్మానించారు. స్థానిక వైద్యులు కొత్తపల్లి శ్రీనివాస్, పాల్వాయి హరీష్‌బాబులను వారు కలిసి ఆర్మీ అసోషియేషన్ సభ్యులు, వారి కుటుంబసభ్యులకు తమ తమ ఆస్పత్రులలో 50 శాతం డిస్కౌంట్‌తో వైద్యం అందించాలని కోరగా వైద్యులు సమ్మతించారు. దీనితో సభ్యులు ఆ వైద్యులను సన్మానించారు. ఈ సందర్భంగా ఎక్స్ ఆర్మీ అసోషియేషన్ అధ్యక్షుడు కే.శివ మాట్లాడుతూ దేశ రక్షణకు ఎనలేని సేవలందించి రిటైర్ అయిన తమకు వైద్య ఫీజులో రాయితీ కల్పించాలని కోరగా వైద్యులు సమ్మతించడం హర్షించదగ్గ విషయమని అన్నారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు పాపయ్య, ప్రధాన కార్యదర్శి సునీల్ మండల్, సభ్యులు వినాయక చాప్లె, రమాకాంత్‌యాదవ్, శివప్రసాద్, దిలీప్ సర్కార్, రాజేష్, గోపి, తారపద మండల్ పాల్గొన్నారు.

నేడు ఉచిత వైద్య శిబిరం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

మాజీ ఎమ్మెల్యే పాల్వాయి పురుషోత్తంరావు వర్ధంతిని పురస్కరించుకొని శుక్రవారం ప్రజాబంధు ఫౌండేషన్ ఆధ్వర్యంలో కాగజ్‌నగర్ మండలం కడంబా గ్రామంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించనున్నట్లు ఫౌండేషన్ వ్యవస్థాపకులు డాక్టర్ పాల్వాయి హరీష్‌బాబు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. కడంబాతో పాటు సమీప గ్రామాలలో ప్రజలు డెంగ్యూ, వైరల్ జ్వరాలతో బాధపడుతున్నందున ఈ శిబిరం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. జ్వరపీడితులతో పాటు జ్వరం తర్వాత వచ్చే కీళ్ల నొప్పుల బాధితులకు ఉచితంగా రక్తపరీక్షలు చేసి మందులు ఇవ్వనున్నామని, జనరల్ ఫిజీషియన్‌తో పాటు స్త్రీ వైద్య నిపుణురాలు, ఎముకలు, కీళ్ల వైద్య నిపుణులు ఈ శిబిరంలో అందుబాటులో ఉంటారని తెలిపారు.

వినాయక మండపాలకు అనుమతి తప్పనిసరి

నవతెలంగాణ-సిర్పూర్(టి)

వినాయక నవరాత్రులను పురస్కరించుకుని మండపాలు ఏర్పాటు చేసే వారు ఆన్‌లైన్‌లో ధరఖాస్తు చేసుకుని తప్పని సరిగా అనుమతి తీసుకోవాలని ఎస్సై దీకొండ రమేష్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. విద్యుత్ శాఖ నుండి తప్పనిసరిగా అనుమతి తీసుకోవాలని, మైక్ అనుమతి కోసం మీసేవాలో దరఖాస్తు చేసుకొని డీడీలు పొందాలని ఆయన తెలిపారు. గ్రామ పంచాయతీ నుంచి కూడా అనుమతి తీసుకోవాలని, వినాయక విగ్రహాలకు ఆన్‌లైన్ తప్పనిసరని, వీటితో పాటు నమోదు చేసుకున్న అనంతరం సెంటు కాపీని పోలీస్‌స్టేషన్‌లో ఇవ్వాలన్నారు. ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోని మండపాలకు పోలీస్ శాఖ నుంచి అనుమతి ఇవ్వబడదని, నిర్వాహకులు పోలీసులకు సహకరించాలని ఆయన సూచించారు.

వర్షంలోనూ కొనసాగిన ఎస్ఎస్ఏ ఉద్యోగుల నిరసన

నవతెలంగాణ-ఆసిఫాబాద్

క్రమబద్ధికరించాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు కలెక్టరేట్ ఎదుట చేస్తున్న నిరసన దీక్షలు కొనసాగుతున్నాయి. గురువారం భారీ వర్షం కురుస్తున్నప్పటికి తమ 18వ రోజు దీక్షను కొనసాగించారు. వీరి దీక్షకు సిర్పూర్(యూ) మండల విద్యాధికారి సుధాకర్ మద్దతు తెలిపి దీక్ష ఖర్చులకు రూ.3 వేలు అందజేశారు. ఆసిఫాబాద్ ఎంఈఓ మనుకుమార్ కూడా మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించి, రెగ్యులర్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సమగ్ర శిక్షా ఉద్యోగుల సంఘం జిల్లా కోశాధికారి నగేష్, మీడియా ప్రతినిధి గేడేకార్ సంతోష్ కుమార్, పీటీఐ అధ్యక్షుడు సత్యనారాయణ, రమేష్, రాజేష్, సతీష్, కేజీబీవీ సీఆర్టీ సురేఖ రాథోడ్, నాన్ టీచింగ్ సిబ్బంది భవాని, తిరుమల, మమత పాల్గొన్నారు

గురుకుల విద్యార్థుల ప్రతిభ

నవతెలంగాణ-సిర్పూర్(టి)

ఆసిఫాబాద్ జిల్లాలోని కాగజ్‌నగర్ పాత ప్రభుత్వ హైస్కూల్లో జరిగిన నేషనల్ సైన్స్ సెమినార్‌లో సిర్పూర్(టి) గురుకుల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్టు జీసీఓ బాలరాజు తెలిపారు. ఈ నెల 13వ తేదీన కాగజ్‌నగర్‌లో నిర్వహించిన సైన్స్ సెమినార్‌లో ప్రయివేటు, ప్రభుత్వ పాఠశాలల నుంచి అధిక సంఖ్యలో విద్యార్థులు పాల్గొన్నారు. ఇందులో సాంఘీక సంక్షేమ బాలుర గురుకుల పాఠశాల(సిర్పూర్)లో ఎనిమిదవ తరగతి చదువుతున్న విద్యార్థి జె రాజేశ్వర్ మిల్లెట్స్ గుడ్ ఆర్ బ్యాడ్ అనే అంశంపై మొదటి బహుమతి గెలుపొందడం జరిగిందన్నారు. అనంతరం గెలుపొందిన విద్యార్థికి తోటి విద్యార్థులు, అధ్యాపకులు, ఉపాధ్యాయులు అభినందనలు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ప్రిన్సిపల్ ఫ్రాన్సిస్, ఉపాధ్యాయులు, అధ్యాపకులు పాల్గొన్నారు.

బారెగూడ వాగులో ఒకరు గల్లంతు

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని బారెగూడ గ్రామానికి చెందిన ఆత్రం భీంరావు గురువారం చేపలు పట్టడానికి వెళ్లి సమీపంలోని వాగులో గల్లంతైనట్టు కుటుంబీకులు తెలిపారు. గత రెండు రోజుల నుంచి భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో చేపల వేటకు వెళ్లిన భీంరావు బారెగూడ గ్రామ సమీపంలోని వాగు కల్వర్టు వద్ద చేపలు పడుతుండగా ప్రమాదవశాత్తు కాలువలో గల్లంతైనట్టు కుటుంబీకులు తెలిపారు. ఈ మేరకు పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు, గ్రామస్తులు భీంరావు కోసం గాలింపు చర్యలు చేపట్టారు.

ఘనంగా పొలాల పండుగ



కౌటాల : ఎడ్లను ఊరేగింపుగా తీసుకెళ్తున్న రైతులు

నవతెలంగాణ-కౌటాల

మండలకేంద్రంతో పాటు మండలంలోని అన్ని గ్రామాల్లో గురువారం పొలాల పండుగ వేడుకలను ఘనంగా నిర్వహించుకున్నారు. రైతులు ఆరుగాలం కష్టపడి వ్యవసాయం చేస్తుంటే వ్యవసాయానికి ఉపయోగించే ఎద్దులను రంగులతో తీర్చిదిద్ది, అలంకరించి గ్రామ దేవతల చుట్టూ ప్రదక్షణలు చేయించారు. తర్వాత ఎద్దులకు ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించి పండుగ జరుపుకున్నారు.

జైనూర్ : ఏజెన్సీ మండలంలో గురువారం గిరిజనులు పొలాల పండుగను ఘనంగా నిర్వహించారు. పొలాల పండుగ సందర్భంగా బసవన్నలు ఉన్న ప్రతి రైతు ఇంటి నుండి బసవన్నలకు రంగులు, నెమలీ ఈకలు, పూలతో అలంకరించి డప్పుచప్పుళ్లతో హనుమాన్ ఆలయానికి తీసుకెళ్లారు. హనుమాన్ ఆలయం వద్ద గ్రామపెద్దల సమక్షంలో బసవన్నలకు నవధాన్యాలతో నైవేద్యం పెట్టి ఆలయం చుట్టూ ప్రదిక్షణలు చేశారు. ఆలయం చుట్టూ మామిడి ఆకుల తోరణాలతో బసవన్నలకు స్వాగతం పలికారు. అనంతరం ఇంటికి చేరుకొని పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమంలో గ్రామ పటేల్‌లు, దేవారీలు, నాయిక్‌లు, గ్రామపెద్దలు పాల్గొన్నారు.

వాంకిడి : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల్లో పొలాల పండుగను ఘనంగా జరుపుకున్నారు. ఉదయం నుండే రైతులు ఎద్దులను శుభ్రం చేసి వివిధ వస్తువులు, రంగులతో అలంకరించి స్థానిక హనుమాన్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పోచమ్మ గుడి వద్ద ప్రదక్షణలు చేసి ఇండ్లలో బసవన్నలకు పూజా కార్యక్రమాలు నిర్వహించి నైవేద్యాలు పెట్టారు. మండలకేంద్రంలో గల హనుమాన్ ఆలయం వద్ద పొలాల పండుగను చూడడానికి చిన్నాపెద్ద తేడా లేకుండా చేరుకొని ప్రత్యక పూజలు నిర్వహించారు.



జైనూర్ : ఎడ్లకు నైవేద్యం సమర్పింస్తున్న రైతు కుటుంబాలు

బదిలీలు, పదోన్నతుల్లో నకిలీ ధ్రువపత్రాలను నివారించాలి

- టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి

నవతెలంగాణ-ఆసిఫాబాద్

ప్రస్తుతం జరుగుతున్న ఉపాధ్యాయ బదిలీలు, ఉద్యోగున్నతుల నకిలీ ధ్రువపత్రాలు నిశేదించేలా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని టీఎస్‌యూటీఎఫ్ జిల్లా అధ్యక్షురాలు శాంతికుమారి డిమాండ్ చేశారు. గురువారం టీఎస్‌యూటీఎఫ్ జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఆసిఫాబాద్ కలెక్టర్ బొర్కడే హేమంత్‌కి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ గత కొన్ని సంవత్సరాలుగా బదిలీలు, ఉద్యోగున్నతులు లేక ఉపాధ్యాయులు నష్టపోతున్న క్రమంలో ఎట్టకేలకు విద్యాశాఖ బదిలీలు, ఉద్యోగున్నతుల షెడ్యూలు విడుదల చేయడం ద్వారా ఉపాధ్యాయులకు ఊరట కలిగిందన్నారు. జిల్లాలోని అర్హులైన ఉపాధ్యాయులు నష్టపోకుండా వారందరికీ న్యాయం జరిగే విధంగా ఈ ప్రక్రియ పారదర్శకంగా జరగేలా చర్యలు తీసుకోవాలన్నారు. బదిలీలు పదోన్నతుల సమయంలో ప్రాధాన్యత క్రమం ధ్రువపత్రాలను జిల్లా కలెక్టర్ ఆధ్వర్యంలో పరిశీలించాలన్నారు. తప్పుడు ధ్రువ పత్రాలు సమర్పించితే వారిపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని అర్హులైన ఉపాధ్యాయులకు న్యాయం చేయాలని కోరారు. భార్యాభర్తలు ఒకే దగ్గర పనిచేసే విధంగా ఇచ్చిన స్పౌజ్ పాయింట్లు ద్వారా వారు వారి స్పౌజ్ దగ్గర పాఠశాలలకు వెళ్లే విధంగా, పనిచేస్తున్న మండలానికి వెళ్లేటట్లుగా చూడాలని, స్పౌజ్ పాయింట్స్ దుర్వినియోగం కాకుండా ఉండే విధంగా చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీఎస్‌యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సోయం ఇందురావు, కోశాధికారి రమేష్, జిల్లా కమిటీ సభ్యులు ఊశన్న పాల్గొన్నారు.



ఆసిఫాబాద్ కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న టీఎస్‌యూటీఎఫ్ నాయకులు

నేడే భవానీ జాతర

నవతెలంగాణ-వాంకిడి

మండలంలోని సరండి గ్రామ సమీపంలో గల గుట్టపై శుక్రవారం భవానీ జాతరకు ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సర్పంచ్ దుర్గం కమలాకర్ తెలిపారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా దర్శనం కోసం వచ్చే భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు చేపట్టామన్నారు. పొలాల అమావాస్య తర్వాత జరిగే జాతరకు మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామాల నుంచి భక్తులు వచ్చి తమ మొక్కులు చెల్లించుకుంటారు. మహారాష్ట్రలోని బల్లార్షా, చంద్రాపూర్, రాజూర, వరూర్, లకడ్‌కోట్, కాగజ్‌నగర్, ఆసిఫాబాద్, జైనూర్, కెరమెరి తదితర ప్రాంతాల నుంచి కూడా అధిక సంఖ్యలో భక్తులు వస్తారన్నారు.

నేడు గణేష్ మండపాల నిర్వాహకులతో సమావేశం

నవతెలంగాణ-కాగజ్‌నగర్

వినాయక చవితిని పురస్కరించుకొని కాగజ్‌నగర్ పట్టణంలో వినాయక విగ్రహాలను ప్రతిష్టించే అన్ని గణేష్ మండపాల నిర్వాహకులతో శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు భజరంగ్‌దళ్ జిల్లా అధ్యక్షుడు శివగౌడ్ ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక పద్మశాలి భవన్‌లో సాయంత్రం నాలుగు గంటలకు నిర్వహించే ఈ సమావేశానికి గణేష్ మండపాల నిర్వాహకులు, హిందూ బంధువులు హాజరు కావాలని సూచించారు.

నిండు గర్భిణీకి తప్పని ప్రసవవేదన

నవతెలంగాణ-బెజ్జూర్

మండలంలోని గిరిజన గ్రామాలకు చెందిన నిండు గర్భిణులు పురిటి నొప్పులు రాగానే ప్రసవేధనకు గురికాక తప్పడంలేదు. ఈ లాంటి ఘటననే గురువారం మండలంలోని మొగవెల్లి గ్రామ పంచాయతీ పరిధిలోని ఇప్పలగూడెం గ్రామానికి చెందిన గిరిజన మహిళ ఆత్రం రోజా ఆస్పత్రికి వెళ్లేందుకు నరకం అనుభవించింది. బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి వచ్చేందుకు ఆటోలో సుస్మీర్ వాగు వరకు రావడంతో వర్షాల కారణంగా సుస్మీర్, కృష్ణపెల్లి ఒర్రెలు ఉప్పొంగడంతో తిరిగి సోమిని గ్రామం నుంచి పాపన్‌పేట వరకు ఆటోలో ప్రయాణించింది. నిండు గర్భిణీ పురిటినొప్పులతో బాధపడుతూ ఆటోలో ప్రయాణించి, 108 అంబులెన్స్‌లో బెజ్జూర్‌కు చేరుకున్నారు. మొగవెల్లి నుంచి బెజ్జూర్‌కు చేరుకోవాలంటే సుమారు 15 కిలోమీటర్లు ప్రయాణించాల్సి ఉంటుంది. మొగవెల్లి, బెజ్జూర్ ప్రధాన రహదారి మార్గంలో సుస్మీర్, కృష్ణపెల్లి ఒర్రెలు ఉధృతంగా ప్రవహించడం వల్ల ప్రయాణికులకు కష్టాలు తప్పడంలేదు. నిండు గర్భిణీని ఆస్పత్రికి తరలించేందుకు ప్రయత్నించగా ఒర్రెలు ఉప్పొంగడం వల్ల తలాయి, బెజ్జూర్ రోడ్డు మార్గం ద్వారా బెజ్జూర్ ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి తరలించారు.

ప్రజల్లో మమేకమవుతూ సేవలందించాలి

నవతెలంగాణ-జైనూర్

ప్రజల్లో మమేకం అవుతూ కార్యకర్తలు సమస్యలు తెలుసుకొని నిరంతరం సేవలందించాలని ఉమ్మడి జిల్లా ఎమ్మెల్సీ దండే విఠల్ సూచించారు. గురువారం మండల కేంద్రంలోని ఓ టిఫిన్ సెంటర్‌లో సాదారణ వ్యక్తిలాగా ఉదయం సమయంలో కార్యకర్తలతో కలిసి టిఫిన్ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రం సాధించిన నాటి నుంచి నేటి వరకు రాష్ట్ర ప్రభుత్వం పేద ప్రజలకు సంక్షేమ పథకాలను ప్రవేశపెట్టిందన్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు కూడా గ్రామాల్లోకి వెళ్లి ప్రజా సమస్యలు తెలుసుకోవాలన్నారు. వాటి పరిష్కరానికి తన దృష్టికి తీసుకువస్తే చర్యలు తీసుకుంటామని భరోసా ఇచ్చారు. అనంతరం జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ కనక యాదవరావు, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు ఇంతీయాజ్‌లాలా, జిల్లా కోఆప్షన్ సభ్యుడు సయ్యద్ అబూతాలిబ్ ఆధ్వర్యంలో దండేవిఠల్‌ను శాలువతో సత్కరించారు. కార్యక్రమంలో సిర్పూర్(యు) బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు తొడసం ధర్మారావు, మండల కోఆప్షన్ సభ్యుడు అఫ్రోజ్ ఖాన్ పాల్గొన్నారు.

నీతి అయోగ్ నిధులతో సమగ్ర అభివృద్ధి

- కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి కె.మాణిక్ రాజ్

నవతెలంగాణ-ఆసిఫాబాద్

నీతి అయోగ్ ప్రతి అంశాన్ని సద్వినియోగం చేసుకుంటూ సమగ్ర అభివృద్ధికి కృషి చేయాలని కేంద్ర ఆర్థిక వ్యవహారాల సంయుక్త కార్యదర్శి కె.మాణిక్ రాజ్ అన్నారు. నీతి అయోగ్‌లో భాగంగా అభివృద్ధి పనుల కోసం ఎంపికైన తిర్యాణి మండలంలో చేపట్టాల్సిన పనులు, మౌలిక వసతుల కల్పనపై గురువారం జిల్లా కేంద్రానికి వచ్చిన ఆయకు కలెక్టర్ బొర్కడే హేమంత్, అదనపు కలెక్టర్ దీపక్ తివారి ఘనస్వాగతం పలికారు. అనంతరం జిల్లా అధికారులతో వైద్య, మహిళ శిశు సంక్షేమ శాఖల ద్వారా చేపడుతున్న సంక్షేమ కార్యక్రమాలు, గర్భిణులకు, శిశువులకు అందించే పౌష్టికాహారం, ప్రజలకు అందిస్తున్న వైద్య సేవలపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలలో మౌలిక వసతులు కల్పించడంతో పాటు ప్రతి విద్యార్థిపై ప్రత్యక దృష్టి సారించి ఉత్తీర్ణత శాతాన్ని పెంచేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. మండలంలోని 29 గ్రామపంచాయతీలకు రోడ్డు సౌకర్యం కల్పించి మండల కేంద్రానికి అనుసంధానం చేయడంతో అభివృద్ధి మరింత జరుగుతోందన్నారు. ఈ కార్యక్రమంలో సంబంధిత శాఖ అధికారులు పాల్గొన్నారు.

నేరాలకు పాల్పడితే చర్యలు

కౌటాల : అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడితే కేసులు తప్పవని ఎస్సై మధూకర్ గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. పొలాల అమావాస్య, బొడుగ పండుగల నేపథ్యంలో కోడిపంధ్యాల జూదానికి పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని ఎస్సై తెలిపారు. పేకాట, ఇతర జూదాలాంటి ఆటలు ఆడితే పట్టుకొని చట్టపరమైన చర్యలు తీసుకుంటామని, ఆదేవిధంగా క్రికెట్ బెట్టింగ్, ఆన్‌లైన్ జూదం, మట్కా లాంటివి ఆడి జీవితాలు పాడుచేసుకోవద్దని ఆయన తెలిపారు. దీనికి ఎక్కువగా యువత పాల్పడుతున్నారని, పోలీసులకు పట్టుబడితే కేసులు నమోదు చేయడం జరుగుతుందని, కేసులు నమోదైతే ఆర్థికంగా చాలా నష్టపోతారని, ఉద్యోగ అవకాశాలు సైతం కోల్పోతారని తెలిపారు. అసాంఘిక కార్యకలాపాలకు పాల్పడే వారి సమాచారం అందిస్తే వారి పేర్లను గోప్యంగా ఉంచుతామని ఎస్సై పేర్కొన్నారు.

సర్వేతోనే ఉత్పత్తి, ఉత్పాదకత ఆధారపడి ఉంటుంది

నవతెలంగాణ-నస్పూర్



ఉత్పత్తి ఉత్పాదకత అనేది సర్వేపైన ఆధారపడి ఉంటుందని జనరల్ మేనేజర్ సర్వే కార్పొరేట్ పీఎస్కే రవి అన్నారు. గురువారం ఆయన శ్రీరాంపూర్ ఏరియాలోని సర్వే విభాగాలను పరిశీలించారు. అనంతరం మాట్లాడుతూ సర్వే విభాగ ఉద్యోగులు ఖచ్చితమైన సర్వేను చేయాలని సూచించారు. శ్రీరాంపూర్ ఏరియాకు మొదటిసారిగా వచ్చిన సందర్భంగా శ్రీరాంపూర్ ఏరియా జనరల్ మేనేజర్ బి.సంజీవరెడ్డి ఆయనను సన్మానించారు. ఈ కార్యక్రమంలో ఏరియా ఇంజనీర్ చంద్రశేఖర్‌రెడ్డి, ఇందారం ఉపరితల గని ప్రాజెక్ట్ ఆఫీసర్ ఎం.శ్రీనివాస్, డీజీఎం పర్సనల్ అరవిందరావు, సర్వే అధికారి (కార్పొరేట్) వెంకటేశ్వర్లు, శ్రీరాంపూర్ ఏరియా సర్వే అధికారి వెంకటేశం, ఎస్ఈ పర్వేజ్ చంద్రశేఖర్ పాల్గొన్నారు.

వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు మృతి

నవతెలంగాణ-రామకృష్ణాపూర్



పట్టణ పోలీస్‌స్టేషన్ పరిధిలోని గద్దెరాగడి ప్రాంతంలో మంచిర్యాల నుంచి మందమర్రి వైపు వెళ్లే జాతీయ రహదారిలో గుర్తు తెలియని వాహనం ఢీకొని గుర్తు తెలియని వృద్ధుడు ఫ్లైవుడ్ షాపు ఎదురుగా కింద పడి ఉన్నాడు. వెంటనే షాపు యజమాని డయల్ 100, 108 అంబులెన్స్ కాల్ చేసి చికిత్స నిమిత్తం మంచిర్యాల ప్రభుత్వ ఆసుపత్రికి తరలించాడు. అతని వయసు అందాజా 60 నుంచి 70 సంవత్సరముల మధ్య ఉన్నదని, మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రిలో చికిత్స పొందుతూ ఆ వ్యక్తి చనిపోయినాడు. ప్రస్తుతం మృతదేహం మంచిర్యాల ప్రభుత్వ ఆస్పత్రి మార్చురీలో ఉంచారు. వ్యక్తి ఆచూకీ తెలిసినవారు రామకృష్ణాపూర్ పట్టణ పోలీస్‌స్టేషన్‌లో తెలియజేయాలని ఎస్సై జి.రాజశేఖర్ తెలిపారు.

అంగన్వాడీలను అడ్డుకున్న పోలీసులు



నవతెలంగాణ-జన్నారం

న్యాయమైన డిమాండ్ల కోసం సమ్మె చేస్తున్న జన్నారం అంగన్‌వాడీలను గురువారం లక్షెట్టిపేట్‌లోని, ఐసీడీఎస్ కార్యాలయం ముందు నిరసన చేసేందుకు వెళ్తున్న వారిని పోలీసులు అడ్డుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. కొద్దిసేపటికి వారి వివరాలు సేకరించి, అంగన్‌వాడీ టీచర్లను ఆయాలను వదిలిపెట్టారు. అంగన్‌వాడీలు 4 రోజులుగా సమ్మె చేస్తున్న ప్రభుత్వం స్పందించలేదని ఏఐటీయూసీ జిల్లా కార్యదర్శి తోకల సరస్వతి అన్నారు. సామరస్యంగా దీక్ష కొనసాగిస్తే పోలీసులు ప్రభుత్వం అడ్డుకోవడం సమంజసం కాదన్నారు. న్యాయమైన డిమాండ్లను ప్రభుత్వం పరిశీలించి వెంటనే పరిష్కరించాలని కోరారు.

వర్షానికి కూలిన ఇంటి గోడ



పడిన ఇంటి గోడతో బాధితుడు

నవతెలంగాణ-కోటపల్లి

మండలంలోని ఆలుగామ గ్రామంలో బుధవారం రాత్రి కురిసిన భారీ వర్షాలకు దుర్గం జైరాం ఇల్లు గోడ కూలిపోయింది. బాధితుడు తెలిపిన వివరాల ప్రకారం.. రాత్రి వర్షానికి రెండు గంటల సమయంలో ఒక్క సరిగా గోడ కింద పడిందని గోడ బయట వైపు పడటంతో ప్రాణహాని జరగలేదు. తాము నిద్రించిన వైపు పడిఉంటే బ్రతికే వాళ్ళము కాదని అన్నారు. ప్రభుత్వమే తమని ఆదుకోవాలని కోరుతున్నారు.

132 కేవీ సబ్‌స్టేషన్ ఏర్పాటు దీక్షకు గల్ఫ్ కార్మికుల మద్దతు



నవతెలంగాణ-జన్నారం

సామాజిక ఉద్యమకారుడు భూమాచారి చేస్తున్నటువంటి దీక్షకు ప్రభుత్వం, అధికారులు స్పందించి 132 కేవీ సబ్ స్టేషన్ ఏర్పాటు చేయాలని తెలంగాణ గల్ఫ్ కార్మికుల సంక్షేమ సమితి డిమాండ్ చేశారు. గురువారం ఆయన చేపట్టిన దీక్షకు గల్ఫ్ కార్మికులు సంపూర్ణ మద్దతు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవస్థాపక రాష్ట్ర అధ్యక్షులు కల్లేడ భూమయ్య, రాష్ట్ర ప్రచార కార్యదర్శి మహమ్మద్ హసన్, రాష్ట్ర సలహాదారులు మగ్గిడి తిరుపతి మండల ప్రధాన కార్యదర్శి దుమ్మల ఎల్లయ్య, తోకల సురేష్, అక్బర్, సుధాకర్, జక్కు లక్ష్మణ్,అంజన్న, భూమన్న, తదితరులు పాల్గొన్నారు.

ఆశా వర్కర్ల సమ్మె నోటీస్ అందజేత



నవతెలంగాణ-నస్పూర్

ఆశ వర్కర్ల సమస్యలు పరిష్కరించాలని, లేనిచో 25వ తేదీ నుంచి సమ్మెలోకి వెళ్తున్నట్లు కలెక్టర్ కార్యాలయం ఏఓకి తెలంగాణ ఆశా వర్కర్స్ యూనియన్ (సీఐటీయూ) ఆధ్వర్యంలో సమ్మె నోటీసును అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి రంజిత్ కుమార్ మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా ఆశాల సమస్యలను పరిష్కరించడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందన్నారు. ఆశాలకు స్థిరమైన వేతనం రూ.18వేలు నిర్ణయించి ఇవ్వాలని డిమాండ్ చేశారు. పీఫ్, ఈ ఎస్ఐ, రూ,10 లక్షలు ప్రమాద భీమా సౌకర్యాలు కల్పించాలని, ఆశాలతో అదనపు పనులు చేయించవద్దన్నారు. సెప్టెంబర్ 24వ తేదీ లోపు సమస్యలు పరిష్కరించాలని, లేకుంటే సెప్టెంబర్ 25 తర్వాత రాష్ట్ర వ్యాప్తంగా సమ్మెకు వెళ్తున్నామని తెలిపారు. ఈ కార్యక్రమంలో కవిత, సమ్మక్క, పద్మ మంగ,లక్ష్మీ, జ్యోతి పాల్గొన్నారు.

అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్న ఒకరి అరెస్ట్

నవతెలంగాణ-ఖానాపూర్

మామడ మండలంలోని జగదాంబతండాలో అక్రమంగా గుడుంబా తయారు చేస్తున్నారని సమాచారం మేరకు గురువారం ఎక్సైజ్ అధికారులు తండాలో దాడులు నిర్వహించగా పరింగ బాయ్ అలియాస్ పంగి బాయ్ గుడుంబా తయారు చేసి అమ్ముతుండగా పట్టుకుని కేసు నమోదు చేసినట్టు నిర్మల్ స్టేషన్ ఎక్సైజ్ ఎస్సై రాయబారపు రవికుమార్ తెలిపారు. ఈ తనిఖీల్లో నిషేధిత గుడుంబా తయారు చేసి అమ్ముతుండగా కనుగొని బట్టీని ధ్వంసం చేసి, సుమారు ఐదు లీటర్ల గుడుంబా స్వాధీనం చేసుకున్నట్టు తెలిపారు. నిషేధిత గుడుంబా అమ్ముతున్న మహిళను అరెస్ట్ చేసి కేసు నమోదు చేసినట్లు తెలిపారు. అనంతరం తండాలో నివసిస్తున్న వారిని ఉద్దేశించి, నిషేధిత గుడుంబా తాగడం వల్ల కలిగే అనర్థాలపై అవగాహన కల్పించారు. ఈ తనిఖీల్లో సిబ్బంది రషీద్, గౌతం, హరీశ్, భాస్కర్, కల్పన పాల్గొన్నారు.

ధరల దగదగ.. సామాన్యులు విలవిల

- ఉక్కిరి బిక్కిరి చేస్తున్న ఉల్లి ధర
- కొండెక్కిన బియ్యం, పప్పులు, కూరగాయల ధరలు



నవతెలంగాణ-తాండూర్

నిత్యవసర ధరలు మండిపోతుండడంతో కొనలేక తినలేక సామాన్యులు విలవిలలాడిపోతున్నారు. పప్పులు బియ్యం కూరగాయలు వంట గ్యాస్ ధరలు సామాన్యులకు అందుబాటులో లేకుండా పోతున్నాయి. సామన్య మధ్యతరగతి ప్రజలు అధిక ధరలతో ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. ప్రతి మనిషి నిత్యజీవితంలో పౌష్టికాహారం తీసుకోవాలన్న విషయం పక్కన పెడితే సామాన్యుడికి పూట గడవని పరిస్థితులు నెలకొన్నాయి. మొన్నటి వరకు అన్ని వంటల్లో వాడే టమాటా ధర కొనలేని స్థాయిలో ఉండగా ప్రస్తుతం నిత్యం వాడే ఉల్లిగడ్డ ధర సామాన్యులకు కొనలేని పరిస్థితి నెలకొంది. టమాట మినహా మార్కెట్లో వంకాయ, బెండ, బీర. కాకరకాయ కూరగాయల రేట్లు దిగి రావడం లేదు. ప్రభుత్వం ముందు చూపు చర్యలు చేపట్టా లేకపోవడం వల్లే ప్రస్తుత పరిస్థితులు ఈవిదంగా దాపురించాయని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

ధరల నియంత్రణలో విఫలం

ధరల నియంత్రణలో ప్రభుత్వం విఫలమైందని ప్రజలు ఆరోపిస్తున్నారు. కేవలం రూ.5వేల పెట్టుబడి సాయం అందించి చేతులు దులుపుకోవడంతో రైతులు కూరగాయలు పంటలపై ఆసక్తి చూపడం లేదని విమర్శలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వం ఉద్యానవన శాఖ ద్వారా కూరగాయల వంటలను ప్రోత్సహించేందుకుగాను సబ్సిడీ విత్తనాలు మల్చింగ్ షీట్స్ సెట్ నెట్స్ కూరగాయల పందిర్లుసబ్సిడీపై అందించి రైతులను కూరగాయల పంటల వైపు ప్రోత్సహించాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

కొండెక్కిన పప్పు ధరలు

ప్రస్తుతం పప్పుల ధరలు అమాంతం పెరిగిపోయాయి. ప్రస్తుతం మార్కెట్లో కందిపప్పు కిలో ధర రూ.130, పెసరపప్పు రూ.110, సెనగపప్పు రూ.70 ~ పలుకుతోంది. ప్రస్తుత పరిస్థితుల్లో సామాన్యులు పప్పులు కొనలేని పరిస్థితి నెలకొంది. గత ఏడాది వాతావరణ పరిస్థితి వల్ల పప్పు దినుసుల పంటల సాగుతో రైతులు నష్టపోయినప్పటికీ ప్రభుత్వం ఎటువంటి నష్టపరిహారంగాని ప్రోత్సాహన్ని అందించలేదు. దాంతో ఈ సంవత్సరం రైతులు పప్పు దినుసుల పంటలపై రైతులు ఆసక్తి కనపర్చకపోవడం వల్ల పప్పు దినుసుల వంటల సాగు గణనీయంగా తగ్గిపోయింది. రాబోయే రోజుల్లో పప్పు ధాన్యం రేట్లు మరింత పెరిగే అవకాశాలు ఉన్నాయని సామాన్యులు కలవర పడుతున్నారు. గత ప్రభుత్వాల హాయంలో రేషన్ షాపుల ద్వారా సబ్సిడీపై పప్పులు పంపిణీ జరిగేది ప్రస్తుత ప్రభుత్వం సబ్సిడీ పప్పుల పంపిణీ రద్దు చేసింది.

భారమవుతున్న బియ్యం ధరలు

కూరగాయల పప్పులతో పాటు బియ్యం ధరలు అమాంతంగా పెరిగిపోయాయి. మార్కెట్లో ఏ గ్రేడ్ బియ్యం ధర రూ.5వేలకు పైగా ఉండటం సామాన్యులకు భారంగా మారింది. ధరలతో ప్రజలు ఉక్కిరి బిక్కిరి అవుతున్నారు. రైతు దగ్గర నుంచి క్వింటాలు వడ్లకు రూ.2వేల 200 ధర చెల్లించి కొనుగోలు చేసే మిల్లర్లు బియ్యాన్ని బ్లాక్ చేసి ధరలను విపరీతంగా పెంచేస్తున్నారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. బ్లాక్ మార్కెట్‌పై అధికారుల నియంత్రణ చర్యలు చేపట్టకపోవడంతో వ్యాపారులు ఇష్టారాజ్యంగా ధరలు పెంచేస్తున్నారని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం స్పందించి నిత్యవస ధరలనియంత్రణపై చర్యలు తీసుకోవాలని ప్రజలు కోరుతున్నారు.

ప్రభుత్వం రైతులను ప్రోత్సహించాలి

-పులిశెట్టి సత్తయ్య, రైతు ద్వారకాపూర్



రైతులను ప్రభుత్వ ప్రోత్సహించి ఒకే పంట విధానం కాకుండా పప్పు దినుసులు, కూరగాయలు, ఆహార పంటల సాగుకు సహకరించాలి. అందుకు అనుగుణంగా వ్యవసాయ, ఉద్యానవన శాఖలకు బడ్జెట్‌లో నిధులు కేటాయించాలి వ్యవసాయ రంగంలో ఆధునిక సాంకేతిక యాంత్రికరణ రంగాలకు సబ్సిడీలను పెంచాలి. మార్కెట్లో కూరగాయల ధరలు పడిపోయినప్పుడు ఎగుమతులకు ప్రాధాన్యత ఇవ్వడం వల్ల రైతులు క్రమం తప్పకుండా కూరగాయలు సాగు చేసే అవకాశం ఉంది. టమాట ధర తగ్గినప్పుడు ప్రభుత్వమే కొనుగోలు చేసి ఫుడ్ ఫ్యాక్టరీలకు సరఫరా చేయాలి. ఆహార పంటల సాగుపై శిక్షణ అవగాహన కార్యక్రమాలు చేపట్టాలి.

ఉద్యోగులు విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలి



- మంచిర్యాల కలెక్టర్ బదావత్ సంతోష్

నవతెలంగాణ-నస్పూర్

ప్రభుత్వం ఇటీవల చేపట్టిన విఆర్ఓ, విఆర్ఎల క్రమబద్ధీకరణలో భాగంగా మున్సిపాలిటీలకు కేటాయించబడిన వార్డు అధికారులు తమకు కేటాయించిన విధులను సమర్థవంతంగా నిర్వర్తించాలని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. గురువారం సమీకృత జిల్లా శాఖల కార్యాలయాల భవన సమావేశ మందిరంలో అదనపు కలెక్టర్(స్థానిక సంస్థలు) బి.రాహుల్‌తో కలిసి మున్సిపల్ కమిషనర్లు, ఉద్యోగుల క్రమబద్ధీకరణలో మున్సిపాలిటీలలో నూతనంగా నియమితులైన వార్డు అధికారులకు శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ వార్డు అధికారులు మున్సిపాలిటీల నిర్వహణలో అత్యంత కీలకమైన పాత్ర నిర్వర్తిస్తారని, నూతనంగా నియమితులైన వార్డు అధికారులకు మున్సిపల్ కమిషనర్లు విధి నిర్వహణలో అవసరమైన సూచనలు, సలహాలు ఇస్తూ వారు విధులు సక్రమంగా నిర్వహించేలా పర్యవేక్షించాలని తెలిపారు. జనన, మరణ ధృవీకరణ పత్రాలు, అంతర్గత రహదారులు, మురుగు కాలువలు, తాగునీటి సరఫరా, హరితహారం, గృహలక్ష్మి, పారిశుధ్యం, ఘన, ద్రవ వ్యర్థాల నిర్వహణ తదితర అన్ని అభివృద్ధి పనులను ఎలాంటి పొరపాట్లు లేకుండా సక్రమంగా నిర్వహించాలని తెలిపారు. శిక్షణలో భాగంగా లాగ్ బుక్ నిర్వహణ, టెండర్ల ప్రచురణ, గుత్తేదారుల చెల్లింపులు, ఇంజనీరింగ్, రెవెన్యూ, పారిశుధ్య, మెప్మా, అకౌంట్ విభాగాల విధులను నిర్వహించాలని పేర్కొన్నారు. నూతన ఇండ్లకు నంబర్ల కేటాయింపు, ముటేషన్లు, మార్కెట్, థాయ్ బజార్‌ల వేలం, పన్నుల వసూలు తదితర అంశాలపై అధికారుల సూచనల మేరకు పని చేయాలని ఆదేశించారు.

ప్రశాంత వాతావరణంలో పండుగ జరుపుకోవాలి

- ఏసీపీ పంతాటి సదయ్య



నవతెలంగాణ-తాండూర్

గణేష్ పండుగ ఉత్సవాలను ప్రశాంతమైన వాతావరణంలో జరుపుకోవాలని బెల్లంపల్లి ఏసీపీ పంతాటి సదయ్య అన్నారు. గురువారం బెల్లంపల్లి పట్టణ కేంద్రంలోని పద్మశాలి భవన్‌లో వినాయక ఉత్సవ కమిటీ, నిర్వాహకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఏసీపీ మాట్లాడారు. పర్యావరణాన్ని కాపాడేందుకు మట్టితో చేసిన విగ్రహాలను ప్రతిష్ఠించాలని తెలిపారు. చందాలను బలవంతంగా వసూలు చేయరాదన్నారు. మండపాల వద్ద కమిటీ సభ్యులలో ఇద్దరు కాపలాగా ఉండే విధంగా చూసుకోవాలని తెలిపారు. ఉదయం 8 గంటల నుండి రాత్రి 9గంటల వరకు మాత్రమే స్పీకర్లు వినియోగించాలని, కులాలను, మతాలను కించపరిచే విధంగా పాటలు వేయరాదని తెలిపారు. మండపాల వద్ద ట్రాఫిక్ అంతరాయం కలగకుండా చూసుకోవాలని, ఇరుకైన గల్లీలలో మండపాలను ఏర్పాటు చేయరాదని పేర్కొన్నారు. వినాయక నిమజ్జనం రోజు ఊరేగింపుకు నిర్దేశించిన సమయం లోపు పూర్తయ్యేలా చూసుకోవాలని తెలియజేశారు. కార్యక్రమంలో బెల్లంపల్లి పట్టణ ఇన్‌స్పెక్టర్ శంకరయ్య, బెల్లంపల్లి రూరల్ సీఐ రాజకుమార్‌గౌడ్, తాండూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్ శ్రీనివాసరావు, ఎస్సైలు ప్రవీణ్‌కుమార్, నరేష్, రవికుమార్ పాల్గొన్నారు.

నస్పూర్ : గణేష్ నవరాత్రి ఉత్సవాలను భక్తిశ్రద్ధలతో ఇతరులకు ఇబ్బంది కలిగించకుండా ప్రశాంతత వాతావరణంలో నిర్వహించుకోవాలని సీసీసీ నస్పూర్ ఎస్ఐ రవికుమార్ తెలిపారు. గురువారం ఉత్సవ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రశాంత వాతావరణంలో నవరాత్రి ఉత్సవాల్ని జరుపుకోవాలని, వినాయక విగ్రహాలు పెట్టదలచిన వారు ఆన్‌లైన్‌లో తప్పనిసరిగా అప్లై చేసుకొని ఎలక్ట్రిసిటీ, మైక్ పర్మిషన్ తీసుకోవాలని తెలిపారు. రహదారులకు అడ్డుగా మండపాలను ఏర్పాటు చేయకుండా ఉండాలని, మండపం ఏర్పాటు చేసిన నిర్వాహకులు 24గంటలు పర్యవేక్షిస్తూ ఉండాలని తెలిపారు. రాత్రి సమయాల్లో మండపాల వద్ద అసాంఘిక కార్యక్రమాలకు పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. గణేష్ నిమజ్జనానికి డీజే బాక్సులు పెట్టవద్దని, ఏదైన అత్యవసరమైతే 100కి ఫోన్ చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండప నిర్వాహకులు, స్థానిక ప్రజలు పాల్గొన్నారు.

జన్నారం : వినాయక మండప నిర్వహణకులు తప్పనిసరిగా పోలీసుల అనుమతి తీసుకోవాలని జన్నారం ఎస్సై పీ.సతీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని పీఆర్టీయూ భవన్‌లో మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన వినాయక మండప నిర్వహకులు ఇతర నాయకులతో పీస్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్సై మాట్లాడుతూ ప్రధాన కూడలిలాలో మండపాలు ఏర్పాటు చేస్తే ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూసుకోవాలన్నారు. విద్యుత్ అధికారులతో అనుమతి తీసుకొని విద్యుత్‌ను వాడుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి గొడవలు జరగకుండా నిర్వాహకులే చూసుకోవాలన్నారు. మండపాల వద్ద ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా మండాప నిర్వాహకులు చూసుకుంటూ పోలీసులకు సహకరించాలని కోరారు. కార్యక్రమంలో స్థానిక సర్పంచ్ జక్కు భూమేష్ వివిధ గ్రామాలకు చెందిన మండప నిర్వాహకులు ముస్లిం, క్రిస్టియన్, సోదరులు పాల్గొన్నారు.

కాసిపేట : వినాయక చవితి సందర్భంగా గణేశ్ మండపాలకు ముందుగా విద్యుత్ ఏఈ నుంచి తమ విద్యుత్ లోడకు అనుగుణంగా రుసుము చెల్లించి తగు జాగ్రత్తలు 'వహిస్తూ విద్యుత్ సౌకర్యంకు అనుమతి పొందాలని కాసిపేట విద్యుత్ శాఖ ఏఈ స్వర్ణలత తెలిపారు. 1000 వాట్స్ లోడ్ వరకు రూ.1,560, 1000 నుంచి 1500 వాట్స్‌కు రూ.2,300, 2000 లోడ్ కన్నా ఎక్కువ లోడ్‌కు రూ.3020, ప్రతి అదనపు 1000 వాట్స్‌కు రూ.1,560 చెల్లించాలన్నారు. ఎవరూ కూడా లైన్లకు కొక్కి వేసి విద్యుత్ వాడటానికి ప్రయత్నించరాదని, రుసుము చెల్లించి విద్యుత్ శాఖ అనుమతి పొందాలన్నారు.

సిహెచ్‌పి రైల్వే సైడింగ్ మెయింటెనెన్స్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలి



నవతెలంగాణ-నస్పూర్

శ్రీరాంపూర్‌లోని సిహెచ్‌పి రైల్వే సైడింగ్ మెయింటెనెన్స్ కార్మికులకు సకాలంలో జీతాలు చెల్లించాలని సింగరేణి కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్(ఏఐటీయూసీ) బెల్లంపల్లి రీజియన్ ప్రధాన కార్యదర్శి అఫ్రోజ్‌ఖాన్, శ్రీరాంపూర్ బ్రాంచ్ అధ్యక్షులు దొడ్డిపట్ల రవీందర్ డిమాండ్ చేశారు. ప్రతి నెల ఏడవ తేదీన వేతనాలు చెల్లించాలని సింగరేణి యాజమాన్యం సర్క్యులర్ జారీ చేసిందని, దాన్ని అమలు చేయడంలో అధికారులు ఎందుకు నిర్లక్ష్యం వహిస్తున్నారో కార్మికులకు తెలియజేయాల్సిన అవసరం ఉందన్నారు. వివిధ విభాగాల్లో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మూలిగే నక్కపై తాటిపండు పడ్డ చందంగా కాలం వెళ్లదీస్తున్న వారికి వచ్చే అరకొర జీతాలను కూడా నెల చివరి వారంలో ఇస్తున్నారని తెలిపారు.

ఆర్కే-1ఏ గనిని సందర్శించిన నూతన జీఎం



నవతెలంగాణ-రామకృష్ణాపూర్

మందమర్రి ఏరియా జీఎంగా బాధ్యతలు స్వీకరించిన మనోహర్ మొదటిసారిగా ఆర్కే-1ఎ గనిని గురువారం సందర్శించారు. ఈ సందర్భంగా ఏఐటీయూసీ ఆధ్వర్యంలో శాలువతో ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో గని ఫిట్ సెక్రెటరీ సరమల్ల వినయ్ కుమార్, సెంట్రల్ కమిటీ సభ్యులు బాలకోటిరెడ్డి, మైన్స్ కమిటీ సభ్యులు కొత్త గిరి ప్రసాద్, సుంకర గట్టయ్య, చిలివేరి హరీష్ పాల్గొన్నారు.

ఐటీఐకి భవనం మంజూరు చేయాలి



నవతెలంగాణ-జన్నారం

మండల కేంద్రంలో గత 12 సంవత్సరాల క్రితం ఐటీఐ భవనానికి స్థలం కేటాయించారని, ఇప్పటివరకు ఆ స్థలంలో భవనం నిర్మించలేదని ఏబీవీపీ రాష్ట్ర కార్యదర్శి పందిరి మనీష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఐటీఐ స్థలంలో ఏర్పాటుచేసిన, బోర్డు వద్ద ఏబీవీపీ ఆధ్వర్యంలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఐటీఐ కళాశాలకు స్థలం ఉన్నప్పటికీ భవనం లేక విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. కళాశాలకు భవనంతో పాటు అన్ని రకాల వసతులు కల్పించి విద్యార్థుల ఇబ్బందులను తీర్చాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తున్నామన్నారు. లేనియెడల ఏబీవీపీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఏబీవీపీ నాయకులు, పాల్గొన్నారు.

ఘనంగా పొలాల అమావాస్య

నవతెలంగాణ-కాసిపేట

కాసిపేట మండలంలోని రేగులగూడ గిరిజన గ్రామంలో గురువారం పొలాల అమావాస్య ఘనంగా నిర్వహించారు. ముందు రోజు హనుమాన్ మందిరంలో భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించి, గురువారం ఉదయమే లేచి గ్రామస్తులంతా పొలిమేరలో గ్రామ దేవతకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం వెంట తెచ్చుకున్న ఆహారాన్ని అందరికీ పంచిపెట్టుకొని సేవించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పటేల్ కుర్సింగ సోనేరావు. గ్రామస్తులు కాంతారావు, వసంతారావు, శర్మాజీ, గోవింద్, వినోద్, చంద్ర కుమార్, రవీందర్, రాంషాప్, హన్మంతరావు, వంశీ కృష్ణ, ప్రవీణ్ పాల్గొన్నారు.

జన్నారం : మండలంలోని 29 గ్రామాలలో గురువారం పొలాల అమావాస్య పండుగను రైతులు ఘనంగా జరుపుకున్నారు. ముఖ్యంగా నేతకానీ కులస్తులు ఈ పండుగను జరుపుకున్నారు. ఎడ్ల కొమ్ములకు రంగులు దిద్ది, కాళ్లకు గజ్జెలు కట్టి అందంగా ముస్తాబు చేసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల చుట్టూ ప్రదక్షిణలు చేయించారు. పిండి వంటలను ఎడ్లకు తినిపించారు. పలు గ్రామాల్లో శోభాయాత్ర నిర్వహించారు. ఊరూరా పోలాల అమావాస్య పండుగను భక్తిశ్రద్ధలతో ఘనంగా జరుపుకున్నారు. ఇందులో భాగంగానే ఎడ్లకు బరువులు దింపే కార్యక్రమం నిర్వహించారు. ఎద్దును ముస్తాబు చేశారు. పితృదేవతలకు నైవేద్యంగా పిండి వంటలు పెట్టి హారతులు పట్టారు. మురిమడుగు, రాంపూర్, తిమ్మాపూర్, తపాల్ పూర్ గ్రామాల్లోని నేతకాని కులాస్తులు పెద్దల పేరుమీద అయ్యవారలకు (కు గురువు జంగమయ్య)కు నిత్యావసర సరుకులు, పిండిపదార్థాలు, నగదు దానంగా ఇచ్చి తమ స్వర్గీయులను స్మరించుకున్నారు.



జన్నారం

లబ్ధిదారులకు గొర్ల పంపిణీ

నవతెలంగాణ-దిలావర్‌పూర్



మండలంలోని మల్లాపూర్ గ్రామంలో గొల్ల కురుమలకు గురువారం బీఆర్ఎస్ నాయకుల ఆధ్వర్యంలో గొర్రెలు పంపిణీ చేశారు. ఒక్కొక్కరికి 21 గొర్ల చొప్పున 15 మంది లబ్ధిదారులకు గొర్రెలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా పిఎసిఎస్ చైర్మన్ రమణరెడ్డి మాట్లాడుతూ బీఆర్ఎస్ ప్రభుత్వం ప్రతి కులానికి లబ్ధి చేకూరేలా పథకాలను అమలు చేస్తోందన్నారు. లబ్ధిదారుల తరపున సీఎం కేసీఆర్‌కు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ అచ్యుత్‌రావు, బీఆర్ఎస్ నాయకులు పాల్దె అనిల్, వెటర్నరీ డాక్టర్ నందకుమార్ పాల్గొన్నారు.

ఖానాపూర్‌లో రక్తదాన శిబిరం

నవతెలంగాణ-ఖానాపూర్



పట్టణంలోని ఏఎంకే ఫంక్షన్ హాల్‌లో టీం జనని తృతీయ వార్షికోత్సవ సందర్భంగా గురువారం రక్తదాన శిబిరం నిర్వహించారు ఈ సందర్భంగా రక్తదానం చేయడానికి యువత చాలామంది ముందుకు వచ్చారు. ఈ సందర్భంగా సేకరించిన రక్తాన్ని నిరుపేదల ప్రాణాలు కాపాడడం కొరకు ప్రభుత్వ హాస్పిటల్‌కి పంపించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కోర్టు పబ్లిక్ ప్రాసిక్యూటర్ కల్వకుంట్ల వినోద్‌రావు, ఖానాపూర్ మున్సిపల్ చైర్మన్ అంకం రాజేందర్, సారంగాపూర్ జెడ్పిటిసి పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, మాజీ జెడ్పీటీసీ రామునాయక్, టిం జనని అధ్యక్షులు తోట సుమిత్, వెంకట్ మహేంద్ర, అడ్వకేట్స్ కవిత, విశ్వాస్‌రెడ్డి, ఉమాదేవి, అఫ్రీన్, దిలావర్‌పూర్ సర్పంచ్ మిరియాల హరిత ప్రతాప్‌రావు, పీఏసీఎస్ చైర్మెన్ అమంద శ్రీనివాస్, రైతుబంధు సమితి జిల్లా డైరెక్టర్ కొక్కుల ప్రదీప్ పాల్గొన్నారు.

పట్టణంలో దొంగల హల్‌చల్

- 16 తులాల బంగారం, రూ.లక్ష అపహరణ

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

పట్టణంలో కొన్ని రోజుల నుండి దొంగలు హల్‌చల్ చేస్తున్నారు. తాళాలు వేసిన ఇళ్లను టార్గెట్‌గా చేసుకోని అందినకాడికి దోచుకెళ్తున్నారు. పట్టపగలే దొంగలు తాళాలు పగులగొట్టి నగదు, బంగారం ఎత్తుకెళ్లిన ఘటనలు కలకలం రేపుతున్నాయి. ఇటీవల రాంనగర్ అపార్ట్‌మెంట్‌లో దొంగలు పడగ ఆ దొంగల ముఠాను బుధవారం వరంగల్ పోలీసులు అరెస్ట్ చేశారు. అలాగే పట్టణంలోని రిక్షాకాలనీలో బుధవారం తెల్లవారుజామున చోరీ జరిగింది. ఇంటికి తాళం వేసి కుటుంబ సభ్యులు ఊరెళ్లారు. ఉదయం దొంగలు తాళం పగలగొట్టి ఇంట్లోకి చొరబడ్డారు. విలువైన వాచీ, కెమెరాను ఎత్తుకెళ్లారు. అయితే అక్కడున్న సీసీ కెమెరాల ద్వారా కుటుంబ సభ్యుల ఫోన్‌కి అలారం రావటంతో వారు డయల్ 100కు సమాచారమిచ్చారు. పోలీసులు ఘటన స్థలానికి వెళ్లగా దుండగులు పరారయ్యారు. తాజాగా గురువారం మధ్యాహ్నం మరొక దొంగతనం జరిగింది. పట్టణంలోని టీచర్స్ కాలనిలో పట్టా పగలే రిటైర్డ్ ఏఎస్ఐ అశోక్ ఇంట్లో దొంగలు పడడం స్థానికంగా కలకలం రేపుతోంది. ఇంట్లో ఉన్న వారు ఉదయం గుడికి వెళ్లడంతో ఇదే అదునుగా దొంగలు గుడికి వెళ్లినవారు తిరిగి వచ్చే సరికి ఇల్లు గుల్ల చేసి పెట్టారు. ఇంట్లో వస్తువులు చిందరవందరగా ఉండడంతో చోరీ జరిగినట్టు భావించి పోలీసులకు సమాచారం ఇచ్చారు. సుమారు 16 తులాల బంగారం, లక్ష నగదు ఎత్తుకెళ్లినట్లు బాధితులు తెలిపారు.

ఉచిత ఈకేవైసీ సేవలు సద్వినియోగం చేసుకోవాలి



ఉచిత శిబిరాన్ని ప్రారంభిస్తున్న రాజేష్

నవతెలంగాణ-ఉట్నూర్

ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డ్ కోసం ఏర్పాటు చేసిన ఉచిత ఈకెవైసి నమోదు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని బీఆర్ఎస్వీ జిల్లా అధ్యక్షుడు రాజేష్ అన్నారు. గురువారం మండలంలోని మత్తడిగూడ గ్రామంలో ఉచిత శిబిరాన్ని బీఆర్ఎస్వి జిల్లా అధ్యక్షులు ధరణి రాజేష్ ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ గ్రామ ప్రజలు తప్పనిసరిగా ఆరోగ్యశ్రీ డిజిటల్ కార్డుల కోసం ఉచిత కెవైసిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. ఆరోగ్యశ్రీ పరిమితిని ప్రభుత్వం 2లక్షల నుంచి 5లక్షల వరకు పెంచిందన్నారు. ఈ కార్యక్రమంలో కెవైసి నిర్వాహకులు జుగ్నక్ గంగాధర్, వినోద్, గ్రామ పటేల్ సిడాం సోనేరావు, మోతీరాం, నాయకులు రామగిరి వాసు పాల్గొన్నారు.

ఫేక్ ఫేస్‌బుక్ అకౌంట్లను నమ్మొద్దు

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్లను నమ్మవద్దని ఎస్పీ డి ఉదయ్ కుమార్‌రెడ్డి గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఫేక్ సోషల్ మీడియా అకౌంట్లను ఎట్టి పరిస్థితుల్లో నమ్మవద్దని, రెస్పాండ్ కాకూడదని తెలియజేశారు. బుధవారం ఆదిలాబాద్ ఎస్పీ పేరుపై ఒక నకిలీ ఫేస్‌బుక్ అకౌంట్ యాక్టివ్ ఉండగా, దాన్ని పోలీసులు గుర్తించి బ్లాక్ చేశారన్నారు. ప్రజలు కూడా ఎటువంటి ఫేక్ అకౌంట్లకు రెస్పాండ్ కావద్దన్నారు. ఈ అకౌంట్ల ద్వారా మోసం చేసి డబ్బులు అడిగే ప్రమాదం ఉన్నందున జాగ్రత్తగా ఉండాలని సూచించారు.

విద్యార్థులకు ఓటు హక్కుపై అవగాహన



నవతెలంగాణ-దిలావర్‌పూర్

మండల కేంద్రంలోని ప్రభుత్వ జూనియర్ కళాశాలలో తెలంగాణ రాష్ట్ర సాంస్కృతిక శాఖ ఆధ్వర్యంలో కళాకారుల బృందం ఓటు హక్కుపై పాటల ద్వారా అవగాహన కల్పించారు. గురువారం కళాశాలలో కార్యక్రమం నిర్వహించి రాజ్యాంగం కల్పించిన ఓటు హక్కును వినియోగించేలా ప్రతి ఓటరుగా తమ పేర్లను నమోదు చేసుకోవాలని ప్రిన్సిపల్ శంకర్ సూచించారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యాపకులు, తెలంగాణ సాంస్కృతిక సారధి కళాకారులు ఎలిశెట్టి సుదర్శన్, కడారి రఘునాథ్, చెనిగారపు నాగరాజు, తోట లక్ష్మణ్, జితేందర్, తస్లీమా, మాధవి, విద్యార్థులు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : అర్హులైన ప్రతి ఒక్కరు ఓటరుగా నమోదు చేసుకోవాలని ఆర్డీఓ స్రవంతి అన్నారు. బుధవారం రాత్రి కలెక్టర్ కార్యాలయంలోని తన ఛాంబర్లో ఓటరు నమోదు, ఓటు హక్కు వినియోగం, ఎన్నికల నిర్వహణపై వివిధ రాజకీయ పార్టీల ప్రతినిధులతో ఆమె సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆర్డీఓ మాట్లాడుతూ అక్టోబర్ 1 నాటికీ 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరూ ఈ నెల 19 వరకు ఓటరుగా నమోదు చేసుకోవాలన్నారు. ఓటరు జాబితాను సంబంధిత పోలింగ్ కేంద్రాలు, తహసీల్దార్, కలెక్టర్ కార్యాలయంలో ప్రదర్శించమని, ఓటు హక్కును పరిశీలించుకోవాలని సూచించారు. జాబితాలో పేరు లేని వారు సంబంధిత ఫారాలను పూరించి బూత్ స్థాయి అధికారులు, తహసీల్దార్ కార్యాలయంలో సమర్పించి నమోదు చేసుకోవాలన్నారు. ఈ సమావేశంలో తహసీల్దార్లు శ్రీనివాస్, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీఆర్ఎస్ నాయకులకే పథకాలు

నవతెలంగాణ-లోకేశ్వరం

ప్రభుత్వం అమలు చేస్తున్న రాయితీ పథకాలు ఎక్కువ శాతం బీఆర్ఎస్ నాయకులకే అందుతున్నాయని బీజేపీ నాయకులు ఆరోపించారు. గురువారం తహసీల్దార్ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించి తహసీల్దార్‌కు వినతి పత్రం అందించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేదలను ఆర్థికంగా ఆదుకునేల ప్రభుత్వం దళిత బంధు, బీసీలకు వంద శాతం రాయితీ రుణాలను అందిస్తుందన్నారు. కానీ ఇందులో అర్హులకు కాకుండా బీఆర్ఎస్ నాయకులకే అందుతున్నాయని ఆరోపించారు. ఈ విషయంలో విచారణ జరిపించి అర్హులైన వారికి పథకాలు అందేల చూడాలని, లేని పక్షంలో ఆందోళనలు చేపడుతామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ముధోల్ అసెంబ్లీ కన్వీనర్ సుమన్, మండల అధ్యక్షుడు గంగాధర్, ప్రధాన కార్యదర్శి సాయినాథ్, రమేష్, శ్రీకాంత్, సర్పంచ్ భుమన్న పాల్గొన్నారు.

నేడు వైద్య కళాశాల ప్రారంభం

- నాయకుల కృషితో తీరనున్న ప్రజల కల



నవతెలంగాణ-ఆసిఫాబాద్

జిల్లా ఆవిర్భావం జరిగి ఏడు సంవత్సరాలు పూర్తయినప్పటికీ జిల్లా కేంద్రంలో సరైన వైద్య సౌకర్యాలు అందడం లేదు. రాష్ట్రవ్యాప్తంగా నూతన వైద్య కళాశాలల ప్రారంభోత్సవంలో భాగంగా నాయకుల కృషి ఫలితంగా మెడికల్ కళాశాల మంజూరు కావడంతో పాటు నిర్మాణ పనులు కూడా తుది దశకు వచ్చాయి. నేడు ముఖ్యమంత్రి కేసీఆర్ వర్చువల్‌గా వైద్య కళాశాలను ప్రారంభించనున్న నేపథ్యంలో వైద్య సేవలు మెరుగయ్యే అవకాశం ఉంది.

మొదటి సంవత్సరం 100 సీట్లు కేటాయింపు

మొదటి సంవత్సరంలో 100 సీట్లు కేటాయించారు. ఇందులో 60 మంది బాలికలు, 40 మంది బాలురు ఉండనున్నారు. వైద్య కళాశాల నిర్వహణ కోసం 22మందిని ప్రభుత్వం కేటాయించింది. కళాశాల నిర్వహణకు 55 మంది అవసరం ఉంది. ప్రస్తుతానికి కేటాయించిన 22 మందిలో ఐదుగురు విధుల్లో చేరగా, వీరిలో ఇద్దరు బోధన, ముగ్గురు ఆసుపత్రి వైద్య సేవలకు సంబంధించిన వారున్నారు. మిగతావారు విధుల్లో చేరాల్సి ఉంది. రూ.53కోట్ల వ్యయంతో 20 ఎకరాల స్థలాన్ని కేటాయించారు. దీనిలో నాలుగు ఎకరాల్లో 8 బ్లాక్‌లతో కళాశాల భవనం నిర్మాణం తుది దశకు చేరుకుంది.

వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా ఆస్పత్రి

వైద్య కళాశాలకు అనుబంధంగా జిల్లా ఆసుపత్రిని సిద్ధం చేయనున్నారు. దీనికి ఇప్పటికే 9కోట్ల వ్యయంతో చేపట్టిన అదనపు భవన నిర్మాణ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. కళాశాలలో చేరే విద్యార్థుల వసతి కోసం ప్రయివేట్ భవనాలను అధికారులు వెతుకుతున్నారు. ఇప్పటికే పలు భవనాలు చూసినప్పటికీ అనేక కారణాలతో వాటిని తిరస్కరించినట్లు తెలిసింది. పాత కలెక్టరేట్ భవనాన్ని ప్రస్తుత సంవత్సరానికి కేటాయించడానికి ప్రయత్నాలు జరుగుతున్నాయని, సంవత్సరంలోగా కళాశాల ఆవరణలో వసతి గృహాలు సిద్ధమయ్యే అవకాశముందని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి.

నాయకుల కృషితో తీరనున్న కల

వైద్య సేవలో ఇతర జిల్లాలతో పోలిస్తే జిల్లా వెనుకబడి ఉందని చెప్పడానికి సందేహం లేదు. అటువంటి పేరును చెరిపేయాలని కంకణం కట్టుకున్న ఎమ్మెల్యే, జిల్లా పరిషత్ చైర్మన్‌లు నూతన మెడికల్ కళాశాల ఏర్పాటులో భాగంగా జిల్లాలో కళాశాల ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. దీనికి ఆయన అంగీకరించి కళాశాల మంజూరు చేశారు. దీంతో ప్రజలకు వైద్య సేవలు మెరుగుకానున్నాయి. నాయకుల కృషితో ఎట్టకేలకు నేడు ముఖ్యమంత్రి వర్చువల్‌గా కళాశాలను ప్రారంభించనుండడంతో ప్రజల చిరకాల వాంఛ నెరవేరనుంది.

నేడు ప్రారంభానికి అన్ని ఏర్పాట్లు చేశాం : నాగార్జునచారి, ప్రిన్సిపాల్, వైద్య కళాశాల

ఉన్నతాధికారులు, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు నేడు కళాశాల ప్రారంభోత్సవానికి అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. వర్చువల్‌గా సీఎం చేతుల మీదుగా కళాశాల ప్రారంభం కానుంది. జిల్లాలోని ప్రముఖులంతా ఈ కార్యక్రమంలో పాల్గొననున్నారు. కేటాయించిన సీట్లు ఇప్పటికే పూర్తిగా నింపబడ్డాయి.

సీడీపీఓ కార్యాలయం ఎదుట అంగన్వాడీల ధర్నా



నవతెలంగాణ-నిర్మల్

తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించాలని కోరుతూ గురువారం అంగన్‌వాడీలు జిల్లా కేంద్రంలోని సీడీపీఓ కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. అనంతరం ఆర్డీఓ కార్యాలయం ఎదుట గల ప్రధాన రహదారిపై రాస్తారోకో నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బొమ్మెన సురేష్ మాట్లాడుతూ అంగన్‌వాడీ ఉద్యోగులు లెబర్ యాక్టు ప్రకారం నెల రోజుల ముందే సమ్మె నోటీస్ ఇచ్చి సమ్మె చేపట్టారన్నారు. కానీ ప్రభుత్వం వారిని బెదిరించడం సరైందికాదన్నారు. తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా సమ్మె చేస్తుంటే ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాల తాళలు పగలగొట్టి ఐకేపీ వీఓఏలు, పంచాయతీ కార్యదర్శులకు అప్పజెప్పడం రెచ్చగొట్టే చర్యలేనని అన్నారు. ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని, కనీస వేతనం రూ.26000 ఇవ్వాలని, పెన్షన్, ఈఎస్ఐ, ఉద్యోగ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. సుప్రీంకోర్టు తీర్పు ప్రకారం గ్రాట్యూటీ చెల్లించాలని రిటైర్మెంట్ బెనిఫిట్స్ టీచర్లకు రూ.10 లక్షలు, హెల్పర్లకు రూ.5 లక్షలు, వేతనంలో సగం పెన్షన్ నిర్ణయిచాలన్నారు. 60 సంవత్సరాల దాటిన అంగన్‌వాడీ ఉద్యోగులు వాలంటరీ రిటైర్మెంట్ కోరితే బెనిఫిట్స్ కల్పించాలన్నారు. ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని, లేని పక్షంలో ఆందోళనలు ఉధృతం చేస్తామన్నారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ జిల్లా ఉపాధ్యక్షులు శైలజ, విజయ, లావణ్య, రమ్య, భాగ్య, హేమలత, నర్సమ్మ, భాగ్య, ఏఐటీయూసీ సంఘ జిల్లా అధ్యక్షురాలు పద్మ పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌టౌన్ : అంగన్‌వాడీ ఉద్యోగులు తమ సమస్యలను పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ తెలంగాణ అంగన్‌వాడీ టీచర్స్ అండ్ వర్కర్స్ యూనియన్ సీఐటీయూ ఆధ్వర్యంలో కలెక్టరేట్ ఎదుట చేపడుతున్న సమ్మె గురువారంతో నాలుగో రోజుకు చేరుకుంది. సమ్మెలో భాగంగా పోలాల అమావాస్య పండుగను పురస్కరించుకుని బోనాల జాతర చేపట్టారు. నెత్తిన బోనాలు ఎత్తుకుని శోభాయాత్రగా తరలివెళ్లి అమ్మవారికి బోనాలు సమర్పించారు. ఈ సందర్భంగా యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు కే.సునీత మాట్లాడుతూ పండుగను కుటుంబ సభ్యులతో కలిసి నిర్వహించుకుంటామని, తమ సమస్యల పరిష్కరించుకునేందు పండుగను కుటుంబ సభ్యులతో నిర్వహించుకోలేక పోతున్నామని అన్నారు. తమ న్యాయమైన డిమాండ్లను పరిష్కరించడంలో ప్రభుత్వం విఫలమైందని అన్నారు. కార్యక్రమంలో యూనియన్ నాయకులు, అంగన్‌వాడీ ఉద్యోగులు ఉన్నారు.

తాంసి : గత నాలుగు రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం సమ్మె చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్తలు గురువారం పొలాల అమావాస్య పండుగ పూట కూడా నిరవధిక సమ్మెలో పాల్గొని నిరసన వ్యక్తం తెలిపారు. పండుగ ఉన్నప్పటికీ తమ కుటుంబం పండుగ చేసుకోకుండా శిబిరం వద్దనే పూజలు చేశారు. తాంసి, భీంపూర్ మండలాలకు చెందిన అంగన్‌వాడీ కార్యకర్తలు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా అంగన్‌వాడీ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు వెంకటమ్మ మాట్లాడుతూ గత నాలుగు రోజులుగా తమ న్యాయమైన డిమాండ్ల సాధన కోసం నిరవధిక సమ్మె చేస్తున్నామని అన్నారు. కుటుంబ సభ్యులతో పండుగ కూడా సంతోషంగా నిర్వహించుకోలేక పోతున్నామని అన్నారు. సీఎం కేసీఆర్ పెద్ద మనసుతో తమ న్యాయమైన డిమాండ్‌లను పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, విఠాబాయి, బాగిర్త, విజయలక్ష్మీ, ప్రమీల గంగమ్మ ఉన్నారు.

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే చర్యలు: కలెక్టర్

నవతెలంగాణ-ఆదిలాబాద్‌టౌన్

విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే వైద్యులు, సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ వైద్యశాఖ అధికారులను హెచ్చరించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ప్రభుత్వ ఆసుపత్రుల్లో రోగులకు అందిస్తున్న సేవలపై అధికారులతో ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని రిమ్స్, కమ్యూనిటీ, ప్రాథమిక ఆస్పత్రుల్లో రోగులకు మెరుగైన వైద్య చికిత్సలు అందించాలన్నారు. వర్షాకాల నేపథ్యంలో డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్ వంటి సీజనల్ వ్యాధుల నియంత్రణకు అవసరమైన చర్యలు చేపట్టాలని అన్నారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో సాధారణ ప్రసవాల సంఖ్యా పెంచేలా ఆశాలు, ఏఎన్ఎంలు, వైద్య సిబ్బంది సమన్వయం చేసుకోవాలని సూచించారు. డాక్టర్లు, వైద్య సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. అనంతరం ఆస్పత్రుల వారిగా హై రిస్క్ కేసుల వివరాలను తెలుసుకున్నారు. ఈ సమావేశంలో స్థానిక సంస్థల అదనపు



కలెక్టర్ ఖుష్బు గుప్త, శిక్షణ సహాయ కలెక్టర్ వికాస్ మోహతో, రిమ్స్ డైరెక్టర్ జైసింగ్ రాథోడ్, జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.నరేందర్ రాథోడ్, వైద్యులు, సిబ్బంది పాల్గొన్నారు.

వైద్య కళాశాల ప్రారంభోత్సవ ఏర్పాట్ల పరిశీలన



నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో ఏర్పాటు చేసిన వైద్య కళాశాలను సీఎం కేసీఆర్ శుక్రవారం వర్చువల్ విధానం ద్వారా ప్రారంభోత్సవం చేయనున్నారు. ఈ సందర్భంగా గురువారం దానికి సంబంధించిన ఏర్పాట్లను మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ వరుణ్‌రెడ్డి, ప్రజాప్రతినిధులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ నిర్మల్ జిల్లాకు మెడికల్ కాలేజ్ మంజూరు చేసినందుకు సీఎం కేసీఆర్‌కు సదా రుణపడి ఉంటామని అన్నారు. నిర్మల్‌లో మెడికల్ కాలేజీ ప్రారంభోత్సవ కార్యక్రమం జరగనుందని, అందుకోసం విద్యార్థులు, ప్రజలతో ఎన్టీఆర్ మినీ స్టేడియం నుంచి ర్యాలీగా బయలుదేరి మెడికల్ కాలేజీ వరకు చేరుకొని కార్యక్రమం నిర్వహించబోతున్నామని అన్నారు. ఇప్పటికే 100 సీట్ల కోసం రిజిస్ట్రేషన్ ప్రక్రియ పూర్తి అయిందని అన్నారు. అందులో 65 మంది మహిళలు, 35 మంది పురుషులు ఉన్నారన్నారని తెలిపారు. మహిళలకు, పురుషులకు వేర్వేరుగా హాస్టల్ వసతి ఉందని అన్నారు. ప్రస్తుతం ఈ కాలేజీ తాత్కాలిక భవనమే అయినప్పటికీ, యేడాదిన్నర లోగా కాలేజీ భవనాన్ని పూర్తి చేస్తామని అన్నారు. దానికి సంబంధించి రూ.66 కోట్లతో టెండర్ ప్రక్రియ పూర్తయిందని అన్నారు. ఒకప్పుడు తెలంగాణ వ్యాప్తంగా 3 మెడికల్ కాలేజీలు మాత్రమే ఉండేవని, కానీ ఇప్పుడు జిల్లాకు ఒకటి చొప్పున 33 కాలేజీలు మంజూరు అయ్యాయని అన్నారు. జిల్లాలో మెడికల్ కాలేజ్ ఏర్పడటం వలన చుట్టు పక్కల గ్రామీణ ప్రాంతాల విద్యార్థులు కూడా దూర ప్రాంతాలకు వెళ్లకుండానే వైద్య విద్యను అభ్యసించవచ్చని అన్నారు. మెడికల్ కాలేజీ లోని విద్యార్థుల ఎంపిక ప్రక్రియ పూర్తి పారదర్శకంగా మెరిట్ పద్ధతిలో జరిగిందని అన్నారు. కళాశాల ప్రారంభోత్సవం తర్వాత తరగతులు ప్రారంభమవుతావుతాయని అన్నారు. ఎన్టీఆర్ స్టేడియం నుంచి దివ్యా గార్డెన్ వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని, ఈ ర్యాలీని విజయవంతం చేయాలని కోరారు. కార్యక్రమంలో సంబంధిత అధికారులు, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

బోథ్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగురవేయడం ఖాయం

- కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాష్



నవతెలంగాణ-ఇచ్చోడ

బోథ్ నియోజకవర్గంలో క్షేత్ర స్థాయిలో ప్రతి ఒక్కరూ కలిసికట్టుగా పని చేస్తే రానున్న ఎన్నికల్లో బోథ్ గడ్డపై కాంగ్రెస్ జెండా ఎగరడం ఖాయమని కర్ణాటక ఎమ్మెల్సీ రాథోడ్ ప్రకాష్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్‌హాల్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ నియోజకవర్గ స్థాయి కార్యకర్తల సమావేశంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కర్ణాటక తరహాలో బూత్ లెవెల్ మేనేజ్‌మెంట్ చేయాలని, అధికార బీఆర్ఎస్ వైఫల్యాలను ప్రజల్లోకి తీసుకెళ్లాలని అన్నారు. బీజేపీ తెచ్చిన నల్ల చట్టాల గురించి ప్రజలను మరింత అవగాహన కల్పించాలని కార్యకర్తలకు పిలుపునిచ్చారు. డాక్టర్ శ్రావణ్ కుమార్‌రెడ్డి తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ ఉపాధ్యక్షులు మాట్లాడుతూ ఈ రాష్ట్రంలో ఉచిత విద్యుత్ ఇచ్చింది, ఆరోగ్యశ్రీ పథకాన్ని ప్రారంభించింది, ఉపాధి హామీ చట్టాన్ని తీసువచ్చిందని కాంగ్రెస్ అని అన్నారు. విద్యా హక్కు చట్టాన్ని, సమాచార హక్కు చట్టాన్ని ఇచ్చిందని అన్నారు. ఈ నెల 17న రంగారెడ్డి జిల్లా మహేశ్వరం నియోజకవర్గంలోని తుక్కుగూడ వద్ద జరిగే విజయభేరి సమావేశాన్ని విజయవంతం చేయాల్సిందిగా కార్యకర్తలను కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ జనరల్ సెక్రటరీ సత్తు మల్లేష్, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ భూపల్లి శ్రీధర్, ఆడే గజేందర్, డాక్టర్ నరేష్ జాదవ్, అన్నెల అశోక్, కుమురం కోటేశ్వర్, జాలై జాకు 17మంది ఎమ్మెల్యే ఆశవాహుల అభ్యర్థులు, లీడర్‌షిప్ డెవలప్‌మెంట్ మిషన్ బోథ్ నియోజకవర్గ సమన్వయకర్త పసుల చంటి, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షులు మహిమద్ ఖాన్, అల్లూరి ప్రఫుల్ చందర్‌రెడ్డి, ఇచ్చోడ మండల అధ్యక్షులు కళ్యాం నారాయణరెడ్డి ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆదిలాబాద్‌రూరల్ : ఢిల్లీ తరువాత తొలిసారిగా తెలంగాణ రాష్ట్రంలోని హైదరాబాద్ కేంద్రంగా కాంగ్రెస్ వర్కింగ్ కమిటీ సమావేశం నిర్వహించనున్నట్లు కర్ణాటక ఎమ్మెల్సీ, ఆదిలాబాద్ పార్లమెంటరీ అబ్జర్వర్ ప్రదీప్ రాథోడ్ తెలిపారు. మావల మండల కేంద్రంలోని ఓ ఫంక్షన్ హాలులో 16, 17 తేదిల్లో నిర్వహించే సభకు జన సమీకరణ, విజయవంతంపై సమావేశం నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అథితిగా హాజరై పలు విషయాలను తెలిపారు. ఈనెల 16, 17 తేదీల్లో హైదరాబాద్‌లో నిర్వహించే వర్కింగ్ కమిటీ సమావేశం విజయవంతం చేయాలన్నారు. ప్రస్తుతం దేశం, రాష్ట్రంలో పార్టీ ఆదరణ పెరిగిందని, కర్ణాటక విజయ స్ఫూర్తితో తెలంగాణలో అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ఆదిలాబాద్‌లో టికెట్టు ఎవరికి వచ్చిన మిగిత వారు కష్టపడి పని చేస్తూ గెలిపించుకొవాలన్నారు. ఈ కార్యక్రమంలో టీపీసీసీ ప్రధాన కార్యదర్శి గండ్రత్ సుజాత, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ అల్లూరి సంజీవరెడ్డి, కిసాన్ సెల్ ప్రెసిడెంట్ శ్రీకాంత్ రెడ్డి, భార్గవ్ దేశ్ పాండే, అంబకంటి అశోక్, నగేష్, భూపల్లి శ్రీధర్, చరణ్ గౌడ్, వసీం, నహీద్, సామ రూపేష్ రెడ్డి, ప్రభాకర్, శాంతన్, ప్రవీణ్, కలిమ్, అప్సర్, కపిల్, అమృత్, వసీం రంజానీ పాల్గొన్నారు.

వినాయక మండపాల రూట్ మ్యాప్ పరిశీలన

నవతెలంగాణ-ఖానాపూర్



ఖానాపూర్ పట్టణంలోని వినాయక మండపాలను, వినాయక శోభయాత్ర రూట్ మ్యాప్‌ను ఆయాశాఖల అధికారులతో కలిసి మున్సిపల్ చైర్మెన్ అంకం రాజేందర్ పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఖానాపూర్ పట్టణంలోని వినాయక మండపాలు, ప్రధాన రహదారులను, రోడ్డులో అడ్డంగా ఉన్న విద్యుత్ వైర్లు, చెట్టుకొమ్మలు, తొలగించేస్తామని అన్నారు. వినాయక మండపాల సభ్యులు వినాయక నిమజ్జనం చేసేటపుడు విద్యుత్ తీగలను చూసుకుంటూ వేయాలని ఎటువంటి ప్రమాదాలు జరగకుండా మండపాల సభ్యులు చూసుకోవాలని అన్నారు. ఈ కార్యక్రమంలో ఖానాపూర్ సీఐ మోహన్, విద్యుత్‌శాఖ డీఈ శ్రీనివాస్, మున్సిపల్ కమిషనర్ మనోహర్, తహసీల్దార్ పరిమల్ బౌమిక్, ఎంపీడీఓ మల్లేశం, ఎస్సై శంకర్, పలు డిపార్ట్‌మెంట్ల అధికారులు పాల్గొన్నారు.

ఘనంగా పొలాల పండుగ వేడుకలు



నవతెలంగాణ-ఆదిలాబాద్ రూరల్

అదిలాబాద్, మావల మండల కేంద్రాలతో పాటు ఆయా గ్రామాల్లో గురువారం పోలాల పండుగను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎద్దులను ముస్తాబు చేసి పోలాల పండుగను ఘనంగా నిర్వహించారు. హనుమాన్, పలు ఆలయాలు చుట్టూ ప్రదర్శన చేసి అనంతరం ఎద్దులకు నైవేద్యం పెడతారు. ప్రతి ఒక్కరూ చిన్న పెద్ద తేడా లేకుండా అందరూ పోలాల పండుగలో పాల్గొన్నారు.

భైంసా : పట్టణంతో పాటు పరిసర గ్రామాల్లో గురువారం పొలాల అమావాస్య పండుగ సందడి కనిపించింది. రైతులు తమకు వ్యవసాయంలో తోడుగా ఉండే ఎడ్లను అందంగా అలంకరించి పూజలు చేశారు. ఎడ్లను హనుమాన్ మందిరాలకు తీసుకువచ్చి పూజలు చేశారు. ఇళ్లలో మట్టి ఎడ్ల ప్రతిమలకు పూజలు చేశారు. పట్టణంలో రైతులు ఎక్కువగా ఉండటంతో అన్ని కాలనీల ఎడ్లను రైతులు కిసాన్ గల్లీకి తీసుకురావడంతో పండుగ వాతావరణం కనిపించింది. నేతాజీ యువజన సంఘం ఆధ్వర్యంలో రైతులను సన్మానించారు. కాగా పటు చోట్ల ఎడ్లకు ఎమ్మెల్యే విఠల్ రెడ్డి పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ కాంతిలాల్ పాటిల్, బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పవార్ రామారావు పటేల్, మాజీ మున్సిపల్ చైర్మెన్ బి. గంగాధర్, కాంగ్రెస్ నాయకులు డాక్టర్ కిరణ్ పాల్గొన్నారు.

బాసర: మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాలలో గురువారం పొలాల అమావాస్య పండుగను రైతులు ఘనంగా జరుపుకున్నారు. రైతులు తమ ఎడ్లను అందంగా అలంకరించి ప్రత్యేక పూజలు చేసి హనుమాన్ ఆలయాల చుట్టూ తిప్పారు.